ఆదివారం
SUNDAY
15.12.2024
సంచిక: 115
సంపుటి: 16
వెల రూ.6.00
పేజీలు: 8
PAGES: 8
హైదరాబాద్
HYDERABAD

సమగ్ర కథనాలు, ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

ఋషి

ధర్మం కోసం అక్షర తపస్సు తెలుగు దినపత్రిక

శ్రీకృష్ణుడి మాట

అనురాగం, భయం, క్రోధం వదిలి నాపైనే మనసు ఉంచి, ఆశ్రయించే సత్పురుషులు జ్ఞాన యోగం వల్ల పరిశుద్ధులై నా సాన్నిహిత్యాన్ని పొందుతారు.

ముహూర్తం

ఆదివారం శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:42 సూర్యాస్తమయం - సా. 5:40 తిథిజ పౌర్ణమి మ. 2:34 వరకు సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం మృగశిర రా. 2:19o వరకు యోగం శుభ రా. 1:57o వరకు కరణం బవ మ. 2:34 వరకు భాలవ రా. 1:28o వరకు వర్జ్యం ఉ. 10:20 నుండి ఉ. 11:52 వరకు దుర్ముహూర్తం సా. 4:12 నుండి సా. 4:56 వరకు రాహుకాలం సా. 4:18 నుండి సా. 5:40 వరకు యమగండం మ. 12:11 నుండి మ. 1:33 వరకు గుళికాకాలం మ. 2:55 నుండి సా. 4:18 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:06 నుండి తె. 5:54 వరకు అమృత ఘడియలు సా. 6:06 నుండి రా. 7:36 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:33 వరకు
గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published From HYDERABAD || www.rhushinews.com facebook: rhushinews twitter: rhushinews instagram: rhushinews

నెహ్రూ పాలనలో..

రాజ్యాంగం ఖూనీ

రాజ్యాంగ నిర్మాతలకూ కాంగ్రెస్ అవమానం
హస్తం పార్టీ ప్రజాస్వామ్య గొంతు నొక్కింది

మన రాజ్యాంగ ఔన్నత్యాన్ని దెబ్బతీసేందుకు, రాజ్యాంగ నిర్మాతల కృషిని మట్టిపాలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించింది. భిన్నత్వంలో ఏకత్వ భావనను ఆ పార్టీ అర్థం చేసుకోలేదు. రాజ్యాంగ శక్తి, ప్రజల ఆశీర్వాదం మాకున్నాయి. మా పరిపాలన చూసి ప్రజలు మూడు సార్లు మాకు అధికారం ఇచ్చారు. ఎన్ని కష్టాలు వచ్చినా రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలు అండగా నిలిచారు. ఈ దేశాన్ని ఒకే కుటుంబం 55 ఏళ్లపాటు పాలించింది. ఆ కుటుంబం ఈ దేశానికి అనేక విధాలుగా నష్టం కలిగించింది. 1947 నుంచి 1952 వరకు ఎన్నికైన ప్రభుత్వం మనకు లేదు. ఆ సమయంలో ఆ కుటుంబం ఈ దేశానికి చేసిన నష్టం అంతా ఇంతా కాదు. రాజ్యాంగాన్ని ఖూనీ చేసేందుకు అనేక విధాలుగా ప్రయత్నించారు.- ప్రధాని మోదీ

ప్రజల మద్దతు లేకుండానే గాంధీల కుటుంబ పాలన

మన రాజ్యాంగం ఎన్నో దేశాలకు స్ఫూర్తి.. దేశం ఏకత్వానికి అడ్డుగా ఆర్టికల్ 370

భారత రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తి .. ఇవి యావత్ దేశం గర్వపడే క్షణాలు

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిది.. రాజ్యాంగంపై చర్చలో ప్రధాని వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): భారత రాజ్యాంగం ఎన్నో దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందని ప్రధాని మోదీ అన్నారు. ఎందరో మహానుభావులు కలిసి మన రాజ్యాంగాన్ని రచించారని చెప్పారు. రాజ్యంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో నిర్వహించిన ప్రత్యేక చర్చలో మోదీ మాట్లాడారు. ప్రజాస్వామ్య పండుగను ఘనంగా నిర్వహించుకుంటున్నామని, ఇవి దేశం గర్వపడే క్షణాలని అన్నారు. "దేశాభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిది. దేశ అధ్యక్షురాలిగా ఆదివాసీ మహిళ ఎన్నికయ్యారు. మహిళలకు అన్ని రంగాల్లోనూ గౌరవం దక్కాలి. మన రాజ్యాంగం మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలిచింది. దేశం అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. ఈ దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చాలి. ప్రజల మధ్య ఐకమత్యం దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. భిన్నత్వంలో ఏకత్వం మనదేశ గొప్ప విధానం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్వార్థపరుల వల్ల అనేక -మిగతా 2వ పేజీలో...



ఐసీయూలో ఎల్‌కే అద్వానీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): బీజేపీ అగ్రనేత, మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయనకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు అపోలో ఆసుపత్రి వైద్యులు తెలిపారు. డాక్టర్ వినిత్ సూరి సంరక్షణలో ఆయనకు చికిత్స చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం అద్వానీ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం అద్వానీ వయసు 97 ఏళ్లు. ఆయన గత కొంతకాలంగా వయో సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జూన్, జులై, ఆగస్టు నెలల్లో పలుమార్లు అస్వస్థతతో ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. తొలుత జూన్ 26న అద్వానీ అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. రెండు రోజుల చికిత్స అనంతరం ఆయన డిశ్చార్జ్ అయ్యారు. జులై 3న మరోసారి ఆయన అనారోగ్యం బారిన పడ్డారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులు ఆయన్ని ఎయిమ్స్‌కి తరలించారు. చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. ఆ తర్వాత ఆగస్టు 6వ తేదీన మరోసారి ఆసుపత్రిలో చేరి చికిత్స అనంతరం ఇంటికి చేరారు. ఇప్పుడు మరోసారి అస్వస్థతకు గురయ్యారు.

2

సినిమా భావోద్వేగాల యుద్ధభూమి

దేశభక్తి, ఐక్యతను సినిమా ప్రేరేపిస్తుంది
అర్జున్‌ను కావాలనే అరెస్టు చేశారు
కేంద్ర హెూం సహాయ మంత్రి సంజయ్
రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ కౌంటర్!



4

2029లోనే ఎన్నికలు

జమిలి అమల్లోకి వచ్చినా మార్పుండదు
ఒక దేశం, ఒకే ఎన్నిక విధానానికి మద్దతు
రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతోంది
స్వర్ణాంధ్ర-2047ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
ప్రజల్లో వైసీపీ విశ్వసనీయత కోల్పోయింది
మీడియాతో ఇష్టాగోష్ఠిలో చంద్రబాబు

98% కులగణన పూర్తి

దేశానికే ఆదర్శంగా కులగణన.. గ్యారెంటీలు పేదలకే అందుతున్నాయ్

- అమ్మలా ఉండే తెలంగాణ తల్లినే తెచ్చుకున్నాం
- రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య తెగువ
- కురుమ భవన ప్రారంభంలో ముఖ్యమంత్రి
- ఎస్సీ వర్గీకరణలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది
- ఎట్టిపరిస్థితుల్లో ఎస్సీ కులాలకు అన్యాయం చేయను
- గ్లోబల్ మాదిగ డే కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీలు పేదలకే అందుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అమ్మలా ఉండే తెలంగాణ తల్లినే తెచ్చుకున్నామని అన్నారు.. ఆ విగ్రహం మన అమ్మకు, అక్కకు ప్రతిరూపమని పేర్కొన్నారు. దేశానికే ఆదర్శంగా కులగణన చేపడుతున్నామని వివరించారు. 98 శాతం కులగణన జరిగిందని వెల్లడించారు. హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో కురుమ భవన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కురుమల నిజాయితీని, గొప్పతనాన్ని ముఖ్యమంత్రి కొనియాడారు. కురుమలు అత్యంత నమ్మకస్తులని తాను ఎప్పుడూ చెబుతూ ఉంటానని, ఊళ్లో -మిగతా 2వ పేజీలో...

రేపు లోక్‌సభకు 'జమిలి' బిల్లు!

ఇప్పటికే బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూపొందించిన రెండు కీలక బిల్లులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ ముసాయిదా బిల్లులు ఈనెల 16వ తేదీన లోక్‌సభ ముందుకు రానున్నట్లు తెలిసింది. ఈ మేరకు అధికారిక వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. డిసెంబర్ 16న 'వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు'ను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 129వ రాజ్యాంగ -మిగతా 2వ పేజీలో...

మార్చి 3 నుంచే ఇంటర్ పరీక్షలు!

3

తెలంగాణలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఖరారు!
పరీక్షల తేదీలపై కసరత్తు చేస్తున్న అధికారులు
అధికారికంగా ప్రకటన వెలువడడమే తరువాయి

నేటి నుంచి గ్రూపు-2 పరీక్షలు

2

పూర్తి ఏర్పాట్లు చేసిన అధికారులు
రాష్ట్రవ్యాప్తంగా 1,368 పరీక్షా కేంద్రాలు

అల్లు అర్జున్ విడుదల

3

త్వరలోనే బాధిత కుటుంబాన్ని కలుస్తా
కేసు విషయంలో ఎంతో మాట్లాడాలని ఉంది
కోర్టు ఆదేశాల మేరకు మాట్లాడలేకపోతున్నా
థియేటర్‌లో అనుకోకుండా జరిగిన ఘటన
ఘటనలో నా ప్రమేయం లేదు: అల్లు అర్జున్

ఋషి దినపత్రిక కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా పనిచేయుటకు మండలాల వారీగా విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్న యువకులు 9666711515 నంబర్‌కు వాట్సాప్ ద్వారా,
rhushinews@gmail.com
మెయిల్‌కు బయో డేటా పంపగలరు.

సినిమా భావోద్వేగాల యుద్ధభూమి

దేశభక్తి, ఐక్యతను సినిమా ప్రేరేపిస్తుంది

అల్లు అర్జున్‌ను కావాలనే అరెస్టు చేశారు

కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్

సీఎం రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ కౌంటర్!

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరోసారి అల్లు అర్జున్‌కు మద్దతుగా మాట్లాడారు. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డికి కౌంటర్ ఇచ్చారు. "సినిమావాళ్లు చేసేది పక్కా బిజినెస్. హీరోలు డబ్బులు పెడుతున్నారు.. ఆ తర్వాత సంపాదించుకుంటున్నారు. వాళ్లేమైనా సరిహద్దుల్లో సైనికుల వలే యుద్ధాలు చేస్తున్నారా?" అని నిన్న ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై తాజాగా బండి సంజయ్ స్పందించారు. సినిమా ఎప్పుడూ భావోద్వేగాల యుద్ధభూమేనని అన్నారు. దేశభక్తి, ఐక్యతను సినిమా ప్రేరేపిస్తుందని తెలిపారు. దేశభక్తి కేవలం సరిహద్దుల్లోనే కాదు, ప్రజల్లో స్ఫూర్తి నింపడంలో కూడా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. అనేక సినిమా పాటలు దేశాన్ని కదిలించాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అల్లు అర్జున్‌ను కావాలనే అరెస్టు చేశారని, ఆయన విషయంలో పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని బండి సంజయ్ చెప్పుకొచ్చారు.

నేటి నుంచి గ్రూపు-2 పరీక్షలు

పూర్తి ఏర్పాట్లు చేసిన అధికారులు

రాష్ట్రవ్యాప్తంగా 1,368 పరీక్షా కేంద్రాలు

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా రేపు, ఎల్లుండి గ్రూప్-2 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి టీజీపీఎస్సీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణ వ్యాప్తంగా 1,368 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలను ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించనున్నారు. 783 పోస్టుల భర్తీకి 2022 డిసెంబర్ 29న నోటిఫికేషన్ విడుదలైంది. పలు కారణాల వల్ల గ్రూప్-2 పరీక్ష వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఈ నెల 15, 16 తేదీల్లో పరీక్షలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. పరీక్షకు హాజరయ్యే వారు హాల్ టికెట్‌తో పాటు ఇటీవల దిగిన పాస్ పోర్టు సైజు ఫొటో, ప్రభుత్వంచే జారీ చేయబడ్డ ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని అధికారులు సూచించారు. ఇక మహిళా అభ్యర్థులకు మంగళసూత్రం, గాజుల వరకే అనుమతించనున్నారు. ఇతర ఆభరణాలు ఉంటే అనుమతించమని స్పష్టం చేశారు. బెల్ట్‌లు, రిమోట్ కీస్‌కు అనుమతి లేదని తెలిపారు.

6 వేల పోస్టులతో మరో మెగా డీఎస్సీ

నిరుద్యోగులకు డిప్యూటీ సీఎం తీపి కబురు

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): నిరుద్యోగులకు తెలంగాణ డిప్యూటీ సీఎం, మంత్రి మల్లు భట్టి విక్రమార్క తీపి కబురు చెప్పారు. త్వరలోనే 6వేల పోస్టులతో మరో మెగా డీఎస్సీ వేస్తామని భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈరోజు రాష్ట్రవ్యాప్త ఒకరోజు హాస్టల్ తనిఖీ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం, మధిర, బోనకల్‌లోని సంక్షేమ, గురుకుల పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంక్షేమ వసతి గృహాల్లో కొత్త మెనూను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. 10 సంవత్సరాలుగా మెస్, 16 సంవత్సరాలుగా కాస్మోటిక్స్ ఛార్జీలలో పెరుగుదల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచామన్నారు. అలాగే త్వరలో 6వేల పోస్టులతో మరో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామన్నారు.

ఇలాంటి ఘటనలు జరిగితే ఊరుకుంటారా?

రాహుల్ గాంధీని నిలదీసిన కేటీఆర్

హైదరాబాద్,డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్ చేపట్టిన కూల్చివేతలపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు మీ కుటుంబంలో జరిగితే, అంగీకరించగలరా..? రాహుల్ గాంధీ జీ అని కేటీఆర్ అడిగారు. పట్టింపు, మానవత్వం లేని ప్రభుత్వాలే ఇలాంటి చర్యలకు పాల్పడుతాయి. తెలంగాణలో ఇంట్లో ఇద్దరు మహిళలు ఉండగానే.. బుల్డోజర్లతో ఆ ఇండ్లను కూలగొట్టారు. మరి వారి భౌతిక భద్రతకు ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పేదలకు ప్రేమ పంచుతాం అనడం అంటే ఇదేనేమో అని కేటీఆర్ విమర్శించారు.

మహిళపై చిరుత దాడి

తలకు తీవ్ర గాయాలు.. రిమ్స్ ఆసుపత్రికి తరలింపు

ఆదిలాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): ఆదిలాబాద్ జిల్లాలో మరోసారి చిరుత విరుచుకుపడింది. బజార్ హత్నూర్ మండలం డెడ్రాలో బహిర్భూమికి వెళ్లిన మహిళపై చిరుత దాడి చేసింది. చిరుత దాడిలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న బాధితురాలిని స్థానికులు గమనించి.. చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. బాధితురాలిని భీమాబాయిగా గుర్తించారు. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవలే కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓ యువతిపై పులి దాడి చేసి ప్రాణాలు తీసిన సంగతి తెలిసిందే. జిల్లాలోని కాగజ్‌నగర్ మండల పరిధిలోని బెంగాలీ క్యాంపు ఆరో నెంబర్ విలేజ్ సమీపంలో గన్నారం గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ కూలీకి వెళ్లింది. పత్తి చేనులో పత్తి ఏరుతుండగా.. పులి వెనక నుంచి అకస్మాత్తుగా దాడి చేసింది. ఊహించని పరిణామం యువతి పులిని ప్రతిఘటించలేకపోయింది. దీంతో పులి మహిళ మెడ భాగంలో తీవ్రంగా దాడి చేసింది. గమనించిన మిగతా కూలీలు కేకలు వేశారు. పులి అక్కడి నుంచి పారిపోయింది. మిగతా కూలీలు ఆమెను ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో లక్ష్మి ఆస్పత్రికి వెళ్లేలోగా మృతి చెందింది.

నెహ్రూ పాలనలో..

రాజ్యాంగం ఖూనీ

మొదటి పేజీ తరువాయి

కష్టాలు పడ్డాం. బానిస మనస్తత్వంతో ఉన్నవాళ్లు దేశాభివృద్ధికి ఆటంకం కలిగించారు. దేశ ఐక్యతను దెబ్బతీసేందుకు కొందరు విషబీజాలు నాటారు" అని మోదీ అన్నారు. ఉపాధిని వెతుక్కుంటూ పేదలు పలు ప్రాంతాలకు వెళ్తారని, పేదలకు ఇబ్బంది లేకుండా 'వన్ నేషన్ – వన్ రేషన్ కార్డ్' విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. "పేదలు ఎక్కడున్నా రేషన్ సులువుగా తీసుకోలగాలి. ఆయుష్మాన్ కార్డు ద్వారా ఉచితంగా వైద్య చికిత్స అందిస్తున్నాం. డిజిటల్ ఇండియా దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. మన రాజ్యాంగం అన్ని భాషలను గౌరవించింది. రాష్ట్రాల మాతృభాషల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. మాతృభాషలో చదివిన పిల్లల్లో సమగ్ర వికాసం సాధ్యపడుతుంది" అని మోదీ అన్నారు. "మన రాజ్యాంగ ఔన్నత్యాన్ని దెబ్బతీసేందుకు, రాజ్యాంగ నిర్మాతల కృషిని మట్టిపాలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించింది. భిన్నత్వంలో ఏకత్వ భావనను ఆ పార్టీ అర్థం చేసుకోలేదు. రాజ్యాంగ శక్తి, ప్రజల ఆశీర్వాదం మాకున్నాయి. మా పరిపాలన చూసి ప్రజలు మూడు సార్లు మాకు అధికారం ఇచ్చారు. ఎన్ని కష్టాలు వచ్చినా రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలు అండగా నిలిచారు. ఈ దేశాన్ని ఒకే కుటుంబం 55 ఏళ్లపాటు పాలించింది. ఆ కుటుంబం ఈ దేశానికి అనేక విధాలుగా నష్టం కలిగించింది. 1947 నుంచి 1952 వరకు ఎన్నికైన ప్రభుత్వం మనకు లేదు. ఆ సమయంలో ఆ కుటుంబం ఈ దేశానికి చేసిన నష్టం అంతా ఇంతా కాదు. రాజ్యాంగాన్ని ఖూనీ చేసేందుకు అనేక విధాలుగా ప్రయత్నించారు. రాజ్యాంగ మార్పుపై రాష్ట్రాల సీఎంలకు నెహ్రూ లేఖలు రాశారు. ఆయన తప్పు చేస్తున్నారని అప్పటి స్పీకర్ రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. ఎంతోమంది పెద్దలు సలహాలు ఇచ్చినా నెహ్రూ వినలేదు. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు అనేకసార్లు ప్రయత్నించారు" అని మోదీ వ్యాఖ్యానించారు. "ఆనాటి కాంగ్రెస్ నేతలు రాజ్యాంగానికి 75 సార్లు సవరణలు చేశారు. ఎమర్జెన్సీ విధించి ప్రజల హక్కులు హరించారు. వేలాది మందిని జైళ్లకు తరలించారు. కోర్టుల నోరు, పత్రికల గొంతు నొక్కేశారు. సుప్రీంకోర్టు

న్యాయమూర్తుల పదోన్నతిని కూడా అడ్డుకున్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అనేక కుట్రలు పన్నారు. నెహ్రూ, ఇందిర, రాజీవ్ ముగ్గురూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీశారు. కీలక నిర్ణయాలు తీసుకునేది పార్టీ అధ్యక్షురాలు అని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అన్నారు. ఇదే కాంగ్రెస్ పాలన తీరుకు నిదర్శనం" అని మోదీ విమర్శలు గుప్పించారు. లోక్‌సభలో రాజ్యాంగంపై రెండో రోజులుగా చర్చ జరుగుతోంది. అధికార, విపక్ష ఎంపీలు రాజ్యాంగంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. రాజ్యాంగంపై చర్చకు ప్రధాని మోదీ సమాధానం ఇస్తున్నారు. నిన్న రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో రాజ్యాంగంపై చర్చను ప్రారంభించారు. దీనిపై విపక్షాల నుంచి ప్రియాంక గాంధీ స్పందించారు. రెండో రోజు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రారంభించారు. రెండో రోజు కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రాజ్యాంగంపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమయంలో అదానీ, అగ్నివీర్, పార్శ్వ ప్రవేశానికి సంబంధించి మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలోనే విపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభకు వచ్చారు. ప్రధాని మోదీ లోక్‌సభకు చేరుకోగానే బీజేపీ ఎంపీలు జై శ్రీరామ్ నినాదాలు చేయడం ప్రారంభించారు. 75 ఏళ్ల రాజ్యాంగ యాత్ర గొప్ప ప్రయాణం అని ప్రధాని మోదీ అన్నారు. మన రాజ్యాంగ నిర్మాతల దీర్ఘకాలిక దృక్పథం, సహకారంతో ముందుకు సాగుతున్నాం. ఇది సంబరాలు జరుపుకోవాల్సిన క్షణం అని ప్రధాని మోదీ అన్నారు. ఈ ఉత్సవంలో పాల్గొన్న వారందరికీ ప్రధాని మోదీ అభినందనలు.లోక్‌సభలో రాజ్యాంగంపై జరిగిన చర్చకు ప్రధాని మోదీ స్పందిస్తూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు, ఆ సమయంలో భారతదేశానికి వ్యక్తీకరించిన అన్ని అవకాశాలను అధిగమిస్తూ భారత రాజ్యాంగం ఇక్కడికి తీసుకువచ్చిందని అన్నారు. ఈ గొప్ప విజయానికి రాజ్యాంగ నిర్మాతలతో పాటు దేశంలోని లక్షలాది మంది పౌరులకు గౌరవపూర్వకంగా నమస్కరిస్తున్నానన్నారు. రాజ్యాంగ నిర్మాతలు ఈ విషయంలో చాలా స్పృహతో ఉన్నారని ప్రధాని మోదీ అన్నారు. 1950 నుంచి భారతదేశంలో ప్రజాస్వామ్యం వస్తోందని నమ్మలేదు. భారతదేశ ప్రజాస్వామ్యం, భారతదేశ గణతంత్ర గతం చాలా గొప్పది. ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు ప్రధాని మోదీ. అందుకే భారతదేశాన్ని నేడు ప్రజాస్వామ్య మాతగా పిలుస్తున్నారు. మనది భారీ ప్రజాస్వామ్యం మాత్రమే కాదు, ప్రజాస్వామ్యానికి తల్లి కూడా అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మహిళా సాధికారతపై ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. రాజ్యాంగంలో మహిళా శక్తి కీలక పాత్ర పోషించిందని ప్రధాని మోదీ అన్నారు. చాలా దేశాలు మహిళలకు ఓటు హక్కును చాలా ఆలస్యంగా ఇచ్చాయని, అయితే భారతదేశంలో రాజ్యాంగం మొదటి నుండి మహిళలకు ఈ హక్కును కల్పించిందని ఆయన గుర్తు చేశారు. భారత ప్రజాస్వామ్యం ప్రపంచానికి స్ఫూర్తిదాయకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు . అందుకే భారతదేశాన్ని ప్రజాస్వామ్య మాతగా పిలుస్తారు. మనది పెద్ద ప్రజాస్వామ్యం మాత్రమే కాదు. మనం ప్రజాస్వామ్యానికి తల్లి వంటిదని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

రేపు లోక్‌సభకు 'జమిలి' బిల్లు!

మొదటి పేజీ తరువాయి

సవరణ బిల్లు కింద జమిలి బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించాయి. ఆ తర్వాత దీనిని చర్చ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపనున్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం. వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్త దేమీ కాదు. 1952లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలా వరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరుపడం మొదలైంది.

98% కులగణన పూర్తి

మొదటి పేజీ తరువాయి

భూమి అమ్ముకోవాలంటే ముందు కురుమలకు అమ్ముకోవాలని చెబు తుంటానని తెలిపారు. పార్లమెంటు లో కూడ కురుమ సోదరుల ప్రాతి నిధ్యం పెంచుతామని చెప్పారు." కురుములకు భూమి అమ్మితే డబ్బు నడుముకు కట్టుకుని తెచ్చి ఇస్తారు.. వారు ఇచ్చిన డబ్బును లెక్కపెట్టుకో వాల్సిన అవసరం లేదు. దొడ్డి కొము రయ్య ఆనాడు రైతాంగ పోరాటంలో తెగువ చూపారు. దొడ్డి కొమురయ్య రైతాంగ పోరాటాన్ని ముందుండి నడిపారు. కురుమలు తెలంగాణ పునర్‌నిర్మాణంలో భాగస్వాములు కావాలనేది ప్రభుత్వ కోరిక. ఈ కురు మ భవనం విద్యకు వేదిక కావాలని అన్నారు. కురుమలకు, యాదవులకు రెండేసి చొప్పున ఎంపీ సీట్లు ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కురుమలను గెలిపి ంచుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. గెలవకపోతే టికెట్లు ఎం దుకు ఇచ్చారని ప్రశ్నలు వస్తాయని చెప్పారు. కర్ణాటక సీఎం సిద్ధరామ య్య కురుమ వర్గానికి చెందిన వ్యక్తినేనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపా రు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎట్టిపరిస్థితుల్లో ఎస్సీ కులాలకు అన్యాయం చేయనని, రిజర్వేషన్ల విషయంలో అందరికీ న్యాయం చేసే బాధ్యత తనదేనని తెలిపారు. హైదరాబాద్ లోని హోటల్ దసపల్లాలో గ్లోబల్ మాదిగ డే 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తరాల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం ఓ వర్గం చేస్తున్న పోరాటానికి మద్దతుగా.. ఇటీవల సుప్రీం కోర్టు నుంచి సానుకూల తీర్పు వెలువడింది. దానిని ప్రస్తావించిన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సుప్రీంకోర్టులోని మాదిగ ఉపకులాల రిజర్వేషన్ల కేసులో బలమైన వాదనలు వినిపించినట్లు వెల్లడించారు. ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ లో కాంగ్రెస్ పార్టీ మాదిగ కుల ఉపకులాల రిజర్వేషన్లపై స్పష్టమైన విధానాన్ని తెలియజేసిందని తెలిపారు.ఎస్సీ వర్గీకరణ అంశంపై ఎన్నికల సమయంలోనే తమ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టమైన ప్రకటన చేశారని గుర్తు చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. మాదిగలకు సంబంధించి అనుకూల నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు దానంతట అదే రాలేదని వ్యాఖ్యానించిన సీఎం రేవంత్ రెడ్డి.. మాదిగలకు అనుకూలంగా తీర్పు రావటంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ గారి నేతృత్వంలో ప్రత్యేకంగా న్యాయవాదులను

నియమించి వాదనను వినిపించినట్లు తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు వెలువరించటంతో ఇక రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆ తీర్పును తూచా తప్పకుండా అమలు చేస్తుందని శాసనసభ వేదిక ప్రకటించినట్లు సీఎం తెలిపారు. తెలంగాణ సమస్యలానే ఎస్సీ వర్గీకరణ సమస్యను జఠిలంగా మారిపోయిందన్న సీఎం రేవంత్ రెడ్డి.. ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వాలు నిర్ణయం తీసుకుని అమలు చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. తరాలుగా మాదికలు ఆకాంక్షిస్తున్నట్లుగా రిజర్వేషన్ల వర్గీకరణ అంశంలో న్యాయం ఉందని.. వారికి న్యాయం చేయాలని ఆలోచన తమ ప్రభుత్వానికి ఉందని తెలిపారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే కార్యచరణ మొదలుపెట్టిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా వర్గీకరణను అమలు చేసేందుకు చేపట్టాల్సిన విధివిధానాలు పై అధ్యయనం చేసేందుకు అధ్యయనం చేస్తున్నామని, అందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించినట్లు తెలియజేశారు. 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని జ్యూడిషియల్ కమిషన్ సైతం నియమించినట్లు వెల్లడించారు. మరో వారం రోజుల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందని, దాని ఆధారంగానే ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం మాదిగ కులస్తులు అడగకుండానే ప్రభుత్వం లో మంచి అవకాశాలు కల్పిస్తున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి.. సీఎం పేషీలో ఆ సామాజిక వర్గం వాళ్లు ఉండాలనే ఉద్దేశ్యంతోనే డాక్టర్ సంగీతను నియమించినట్లు తెలిపారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఉస్మానియా యూనివర్శిటీలో ఎన్నడూ లేనివిధంగా వైస్ ఛాన్స్ లర్ గా ఈ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని నియమించినట్లు తెలిపారు. వీసీగా, విద్యా కమిషన్ మెంబర్ గా, ఉన్నత విద్యా శాఖలో మాదిగ సామాజిక వర్గానికి అవకాశం కల్పించామం టూ ప్రకటించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న స్కిల్ యూనివర్సిటీ బోర్డు డైరెక్టర్ గాను పగిడిపాటి దేవయ్యను నియమించామన్న రేవంత్ రెడ్డి.. తాను ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం మాదిగ సామా జిక వర్గానికి అన్యాయం జరగదని, జరగనివ్వనని తెలిపారు. ఎస్సీలకు న్యాయం చేసేందుకు అన్ని విషయాలు విధాలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఎస్సీ వర్గీకరణ అమల్లో కొంత ఆలస్యం కావచ్చని.. కానీ తప్పక న్యాయం జరుగుతుందని ఈ విషయంలో ఎవరికీ ఎటువంటి అనుమానాలు అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో ఎస్సీ వర్గీకరణను సమర్థవంతంగా అమలు చేసి బాధితులకు న్యాయం చేసే బాధ్యత తనదేనని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

మొదలైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే

డిసెంబర్ 31 వరకు పూర్తి.. పలు జిల్లాల్లో మార్గదర్శకాలు

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): తెలంగాణ వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే మొదలైంది. శనివారం నుంచి మొదలైన ఈ సర్వే, డిసెంబర్ 31 వరకు జరగనుంది. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించిన జిల్లా కలెక్టర్లు అందుకు సంబంధించి మార్గ దర్శకాలను జారీ చేశారు. రోజుకు కనీసం 20 దరఖాస్తులను సర్వే చేయాలన్నది ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా ప్రతీ 500 దరఖాస్తులకు ఒక సర్వేయర్ ఉండనున్నారు. పట్టణాల్లో వార్డు అధికారి, బిల్ కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్ ఉంటారు. అదే గ్రామాల్లో అయితే గ్రామ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది వివరాలు సేకరించనున్నారు. ఒకరోజు ముందుగానే సర్వే గురించి గ్రామాలు, వార్డులకు సమాచారం ఇచ్చారు. దీనికి సంబంధించి పత్రాలను రెడీ చేయాలని ఇప్పటికే తెలిపారు. ఇక కలెక్టర్లు, హౌసింగ్ శాఖ పీడీలు దిగువస్థాయికి వెళ్లి యాప్‌లో వివరాల నమోదు తీరును గమనిస్తున్నారు. ఇళ్లు కేటాయింపులో తొలుత వికలాంగులకు, అనాథలు, ఒంటరి మహిళలు, వితంతువులు, ట్రాన్స్ జెండర్లు, సఫాయి కార్మికులు, ఆదివాసీలకు ప్రయార్టీ ఇవ్వనుంది ప్రభుత్వం. ఈ విషయాన్ని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇక దరఖాస్తుదారుడు ఉన్న సొంత ఇల్లు లేదా అద్దె ఇంటి ఫోటోలు తీసి అందులో యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీనికితోడు వారికున్న స్థలాల వివరాలు సేకరిస్తున్నారు. ఇలా చేయడం వల్ల అసలైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వం ఆలోచన. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. కేవలం కార్యకర్తలకు మాత్రమే వచ్చాయి. ఈసారి అలా కాకుండా అసలైన లబ్ధిదారులను న్యాయం జరిగేలా చేస్తోంది కాంగ్రెస్ సర్కార్. ఏడాదికి నాలుగున్నర లక్షల మంది ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఓవరాల్‌గా పరిశీలిస్తే రాబోయే నాలుగేళ్లలో 20 లక్షల మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఆలోచన చేస్తోంది. ఎన్నికల సమయంలో పార్టీ ఇచ్చిన హామీ నెరవేరుతుందని అధికార పార్టీ భావిస్తోంది.

కంట్రోల్‌రూం సేవలను ప్రారంభించిన జీహెచ్ఎంసీ

నగరంలో నిర్లక్ష్యంగా సమగ్ర ఇంటింటి సర్వే

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినటువంటి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా చాలా కాలనీల్లో జరగలేదు. అంతలోనే ప్రభుత్వం నగరంలో కుటుంబ సర్వే ముగిసినట్లుగా ప్రకటించడంతో ఆయా కాలనీవాసులు ఆందోళన చెందారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో గ్రేటర్? నగర వాసుల కోసం కంట్రోల్? రూమును ఏర్పాటు చేయాలని జీహెచ్ఎం సీ(గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్)ను ఆదేశించింది. ఈ మేరకు కుటుంబ సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలనుకునే వారు బల్దియా కంట్రోల్? రూం నంబర్? 040 2111 1111కు సంప్రదించాలని జీహెచ్?ఎంసీ శుక్రవారం ప్రకటించింది. నగరంలో నిర్లక్ష్యంగా సమగ్ర ఇంటింటి సర్వే : జీహెచ్?ఎంసీ పరిధిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే దారితప్పింది. హైదరాబాద్?లో వేలాది అపార్టుమెంట్లకు ఎన్యూమరేటర్లు వెళ్లకుండానే వెళ్లినట్లుగా సర్వే ఫారాలను వారే నింపేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో తమకు ఆసక్తి లేదని ఆప్షన్?తో సర్వే ఫారాలపై ఎన్యుమరేటర్లే పేర్కొంటూ సర్వే ముగిసిందనిపిస్తున్నారు. దాదాపు అధికారులు 20 శాతం ఇళ్లల్లో సమగ్ర కుటుంబ సర్వే చేయలేదు. నగరంలో డిసెంబర్? 2న సమగ్ర కుటుంబ సర్వే పూర్తయిందని అధికారులు వెల్లడించినప్పటికీ తమ ఇంటికి ఎవరూ రాలేదంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పలు ఫిర్యాదులు రావడంతో గ్రేటర్ అధికారులు దీనిపై దృష్టి సారించి టోల్? ఫ్రీ నెంబర్ ఇచ్చారు. కాగా ప్రజల నుంచి సర్వే ద్వారా సేకరించినటువంటి సమాచారం కూడా అసంపూర్తిగా ఉందనే వాదన కూడా వినిపిస్తోంది. ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఐఏఎస్ అధికారులు, పురపాలకశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించినప్పటికీ ఫలితం నామమాత్రంగానే ఉందని సమాచారం. సుమారు 70 ప్రశ్నలతో రూపుదిద్దుకున్నటువంటి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పత్రాన్ని చూసి ప్రారంభంలో ప్రజలు తమ వివరాలను ఇచ్చేందుకు వెనకడుగు వేశారు. ఈ క్రమంలో ఆందోళన వ్యక్తం చేయగా వెంటనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది.

అల్లు అర్జున్ విడుదల

త్వరలోనే బాధిత కుటుంబాన్ని కలుస్తా

కేసు విషయంలో ఎంతో మాట్లాడాలని ఉంది

కోర్టు ఆదేశాల మేరకు మాట్లాడలేకపోతున్నా

థియేటర్‌లో అనుకోకుండా జరిగిన ఘటన

ఘటనలో నా ప్రమేయం లేదు: అల్లు అర్జున్

అల్లు అర్జున్ అరెస్టును ఖండించిన సినీతారలు

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): తనపై నమోదైన కేసుకు సంబంధించి అనేక విషయాలు మాట్లాడాలని ఉన్నా, కోర్టు ఆదేశాల మేరకు మాట్లాడలేకపో తున్నట్లు అల్లు అర్జున్ స్పష్టం చేశారు. సంధ్య థియేటర్ వద్ద విషాదకర సంఘటన జరగడం పట్ల మరోసారి బాధిత కుటుంబానికి క్షమాపణలు చెప్పిన ఆయన, త్వరలోనే ఆ కుటుంబాన్ని కలుస్తానని వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి తనకు మద్దతు ఇస్తున్న వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇవాళ ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్, జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తనపై చూపించిన ప్రేమ, అభిమానానికి అభిమానులకు, దేశవ్యాప్తంగా మద్దతిచ్చిన మీడియాకు కృతజ్ఞతలు చెబుతున్నానంటూ అల్లు అర్జున్ పేర్కొన్నారు. సంధ్య థియేటర్‌లో జరిగింది అనుకోని ఘటన అని, అందులో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. గత 20 ఏళ్లుగా సంధ్య థియేటర్‌కు వెళ్తున్నానని, ఇప్పటి వరకు 30 సార్లు సంధ్య థియేటర్‌కు వెళ్లినట్లు తెలిపారు. ఇలాంటి దుర్ఘటన ఎప్పుడూ జరగలేదని అన్నారు. మరోవైపు జైలు నుంచి ఇంటికి చేరుకున్న అల్లు అర్జున్‌కు ప్రముఖుల నుంచి పరామర్శలు వెల్లువెత్తుతున్నాయి. నందమూరి బాలకృష్ణ స్వయంగా అల్లు అరవింద్‌కు ఫోన్ చేసి అల్లు అర్జున్‌తో మాట్లాడి పరామర్శించారు. ఈ మేరకు కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. 'పుష్ప' దర్శక నిర్మాతలతో పాటు హీరోలు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, రానా, నాగచైతన్య, సుధీర్ బాబు, దర్శకులు రాఘవేంద్రరావు, కొరటాల శివ, వంశి పైడిపల్లి, బి.గోపాల్?, ఆర్. నారాయణమూర్తి, నిర్మాతలు సురేశ్‌బాబు, దిల్ రాజు, బీవీఎన్ఎస్ ప్రసాద్, సంగీత దర్శకుడు తమన్ సహా పలువురు సన్నిహితులు, మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, అవంతి శ్రీనివాస్‌లు అల్లు అర్జున్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. కాసేపు అల్లు అరవింద్, అల్లు అర్జున్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. ముఖ్యంగా చిరంజీవి సతీమణి సురేఖ అల్లుఅర్జున్ నివాసానికి చేరుకోగానే సోదరుడు అల్లు అరవింద్ దగ్గరుండి బన్నీ వద్దకు తీసుకెళ్లారు. తనను హత్తుకొని సురేఖ ఒకింత భావోద్వేగానికి గురికావడంతో అల్లు అర్జున్ కళ్లు చెమ్మగిల్లాయి. ఇలా సినీ, రాజకీయ ప్రముఖులు, సన్నిహితులతో అల్లు అర్జున్ నివాసం వద్ద సందడి నెలకొంది. మరోవైపు అభిమానులు ఎవరూ అర్జున్ నివాసానికి రాకుండా పోలీసులు మూడు వైపుల బారికెడ్లు ఏర్పాటు చేసి భారీ బందోబస్తు నిర్వహించారు. అల్లుఅర్జున్ అరెస్టుపై యావత్ చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. అరెస్టును ఖండిస్తూ పలువురు నటీనటులు తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. సినిమా వాళ్లకు సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రభుత్వ అధికారులు, మీడియా చూపించే ఉత్సాహం సాధారణ పౌరులపై కూడా ఉండాలని కోరుకుంటున్నట్లు నాని తెలిపారు. మంచి సమాజంలో జీవించాలన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన దురదృష్టకరమని, ఆ ఘటన నుంచి పరిశ్రమ ఎన్నో పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. ఈ ఘటనలో ఒక వ్యక్తిని నిందించడం సరైనది కాదని నాని అభిప్రాయపడ్డారు. బాలీవుడ్ నటుడు వరుణ్ ధావన్ కూడా ఇదే అంశంపై ఓ సినీ వేదికలో పరోక్ష వ్యాఖ్యలు చేశారు. భద్రతాపరమైన, ఇతర అంశాలను నటీనటులు ఒక్కరే చూసుకోలేరని, జాగ్రత్తగా ఉండాలని మాత్రమే వాళ్ల చుట్టుపక్కల వారికి సూచిస్తుంటారని వరుణ్ ధావన్ తెలిపారు. ఈ విషయంలో ఒక వ్యక్తిని మాత్రమే నిందించడం అన్యాయమన్నారు. పుష్ప-2 కథానాయిక రష్మిక కూడా బన్నీ అరెస్టుపై ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను తాను నమ్మలేకపోతున్నానని, సంధ్య థియేటర్ వద్ద దురదృష్టకరమని, ఆ ఘటన తన హృదయాన్ని కలచివేస్తుందని పేర్కొంది. అదే సమయంలో ఒకే వ్యక్తిని నిందించడం సబబు కాదని అల్లు అర్జున్‌కు రష్మిక తన మద్దతు ప్రకటించింది. థియేటర్ల వద్ద తొక్కిసలాట ఘటన బాధాకరమన్న నటుడు నితిన్ ఈ ఘటనను తప్పుపట్టడం కంటే దాన్ని నుంచి పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. మరో కథానాయకుడు సందీప్ కిషన్ కూడా బన్నీ అరెస్టును తప్పుపట్టారు. ఊహించని ఘటనలో ఒకే వ్యక్తి ఎలా బాధ్యత వహించగలరని ప్రశ్నించారు. దర్శకుడు అనిల్ రావిపూడి కూడా స్పందిస్తూ సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన మెరుగైన భద్రత అవసరాలను గుర్తు చేస్తుందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుందామని పిలుపునిచ్చిన అనిల్, బాధిత కుటుంబాన్ని ఆదుకోవడంలో అర్జున్ బాధ్యతాయుతంగా వ్యవహరించారన్నారు. అలాంటి వ్యక్తిని ఒక్కరినే బాధ్యత వహించమనడం సరైన నిర్ణయం కాదని అనిల్ అభిప్రాయపడ్డారు. మరో దర్శకుడు అజయ్ భూపతి అల్లు అర్జున్ అరెస్టును ఖండించారు. దర్శకుడు రాంగోపాల్ వర్మ అల్లు అర్జున్ అరెస్టుపై ప్రభుత్వాలకు నాలుగు ప్రశ్నలు సంధించారు. పుష్కరాలు, బ్రహ్మోత్సవాల్లాంటి ఉత్సవాల్లో తోపులాటలో భక్తులు పోతే దేవుళ్లు అరెస్టు చేస్తారా అంటూ ప్రశ్నించారు. ఎన్నిక ప్రచారాల తొక్కిసలాటలో ఎవరైనా చనిపోతే రాజకీయ నాయకులన్ని అరెస్టు చేస్తారా అని ప్రశ్నించిన వర్మ, ప్రీ రిలీజ్ ఫంక్షన్లలో ఎవరైనా పోతే హీరో హీరోయిన్లను అరెస్టు చేస్తారా అంటూ తనదైన శైలిలో ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే భద్రత ఏర్పాట్లు పోలీసులు, నిర్వహకులు తప్ప హీరోలు, ప్రజా నాయకులు ఎలా నియంత్రించగలరని ఆర్జీవీ ప్రశ్నించారు. అల్లు అర్జున్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలియగానే జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి కుటుంబసభ్యులు, సన్నిహితులు తరలివచ్చారు. మెగాస్టార్ చిరంజీవి దంపతుల తోపాటు మెగా బ్రదర్ నాగబాబు, రానా, దర్శకులు సుకుమార్, రాఘవేందర్‌రావు వచ్చి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. అటు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు నిర్మాత దిల్‌రాజు వచ్చి స్టేషన్‌లో ఉన్న బన్నీని కలిసి ధైర్యం చెప్పారు. నాంపల్లి కోర్టుకు దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాతలు నాగవంశీ, బన్నీ వాసు, ఎస్‌కేఎన్ సహా ఆయన సన్నిహితులు హాజరై కోర్టులో జరుగుతున్న పరిణామాలను గమనించారు. ఎప్పటికప్పుడు అల్లు అర్జున్‌కు ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. అల్లు అర్జున్ అరెస్టుపై మెగాస్టార్ చిరంజీవి, పవన్ కల్యాణ్ ఏ విధంగా స్పందిస్తారనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

మార్చి 3 నుంచే ఇంటర్ పరీక్షలు!

తెలంగాణలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఖరారు!

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): ఇంటర్ పరీక్షల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని, షెడ్యూల్ ఖరారు చేసే అంశం తుది దశలో ఉందని అధికార వర్గాలు తెలిపాయి. షెడ్యూల్ దాదాపుగా ఖరారైందని వివరించాయి. వచ్చే వారంలో అధికారికంగా షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అనధికారిక సమాచారం ప్రకారం.. మార్చిలో పరీక్షలు నిర్వహించాలని, ఆ నెలాఖరులోగా అన్ని పరీక్షలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.దీనికి అనుగుణంగా మార్చి 3వ తేదీ నుంచే ఇంటర్ పరీక్షలు ప్రారంభించనున్నట్లు సమాచారం. ఇంటర్ అన్ని గ్రూపులకు చెందిన పరీక్షలు నిర్వహించేందుకు దాదాపు 15 నుంచి 20 రోజుల సమయం పడుతుంది. నెలాఖరులోగా పరీక్షలు పూర్తిచేయాలంటే మార్చి 3న పరీక్షలు ప్రారంభించాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు.

వేతనాల చెల్లింపులో గప్పాలు

14వ తేదీ వచ్చినా జీతాల్లేవ్: హరీశ్ రావు

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): ఏడాది పాలనలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాధించిందేమీ లేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. 14 రోజులు గడిచినా ఇంకా జీతాలు రాలేదని మండిపడ్డారు. ఒకటో తేదీ నాడే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు గప్పాలు కొట్టారని, కానీ ఈ నెల 14వ తేదీ వచ్చినా అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు వేతనాలు చెల్లించలేదని విమర్శించారు. పది నెలలుగా అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దెలు చెల్లించని దుస్థితి నెలకొందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగులను కూడా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు ఉత్తర్వులు ఉంటే తప్ప హక్కుగా రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా వారిని, వారి కుటుంబాలను క్షోభకు గురి చేస్తున్నారన్నారు.

రేవంత్‌రెడ్డికి తెలంగాణ తల్లిపై ప్రేమ లేదు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): తాము ఉద్యమ సమయం నుంచి ఉన్న తెలంగాణ తల్లినే ఆరాధిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఒక చేతిలో జొన్నకర్ర, మరో చేతిలో బతుకమ్మ ధరించిన తెలంగాణ తల్లి వైభవాన్ని చాటేలా పద్యాలు, కవితలు రచించి పుస్తకాలుగా విడుదల చేస్తామన్నారు. ఉద్యమ సమయం తెలంగాణ తల్లి విగ్రహాలను ఊరూరా ఏర్పాటు చేసుకుంటూ వెళతామన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ తల్లిపై ప్రేమ లేదని, అందుకే విగ్రహం రూపాన్ని మార్చారని ఆరోపించారు. తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ లేకుంటే తెలంగాణ సమాజంలో స్నేహశీలత, సుహృద్భావం ఎలా కనిపిస్తుందని ప్రశ్నించారు.

మహిళ చనిపోతే అరెస్ట్ చేయవద్దా?

పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): సినీ నటుడు అల్లు అర్జున్‌పై తమకు ఎలాంటి కక్ష లేదని, అయినా ఆయన కారణంగా ఓ మహిళ చనిపోతే అరెస్ట్ చేయవద్దా? అని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. చిత్ర పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్ రావడానికి కాంగ్రెస్ ముఖ్యమంత్రులే కారణమన్నారు. తొక్కిసలాట కారణంగా ఓ పేద మహిళ చనిపోతే చర్యలు తీసుకోవద్దా? అన్నారు. అనుకోకుండా ఈ దుర్ఘటన జరిగినప్పటికీ చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. చట్ట ప్రకారమే అల్లు అర్జున్‌పై కేసు పెట్టారని, అరెస్ట్ చేశారని, ఆ తర్వాత కోర్టు బెయిల్ (మధ్యంతర) కూడా ఇచ్చిందన్నారు. ఏ నటుడిపై కూడా కాంగ్రెస్ పార్టీకి కోపం లేదన్నారు. తమకు సినిమా వారి పట్ల ప్రేమే ఉందన్నారు.సినిమా తారలపై కేసులు అన్నీ చట్టం పరిధిలోనివే అన్నారు. అల్లు అర్జున్‌పై పెట్టిన కేసును కాంగ్రెస్ పార్టీకి ఆపాదించవద్దని కోరారు. దీనిని అధికార పార్టీకి ఆపాదించే ప్రయత్నం తెలంగాణ బీజేపీ నేతలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతల వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

మోహన్‌బాబు దాడిని ఖండిస్తున్నాం: సీతక్క

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): జర్నలిస్ట్ రంజిత్‌పై సినీ నటుడు మోహన్ బాబు చేసిన దాడిని ఖండిస్తున్నామని, తప్పు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని తెలంగాణ మంత్రి సీతక్క అన్నారు. తప్పు చేసిన వారికి శిక్ష పడాల్సిందే అన్నారు. ఇటీవల మోహన్ బాబు తన ఇంట్లో ఓ జర్నలిస్ట్‌పై దాడి చేశారు. ఈ ఘటనపై మంత్రి స్పందించారు.దాడిలో గాయపడిన జర్నలిస్ట్ వైద్య ఖర్చులను మోహన్ బాబు భరించాలన్నారు. జర్నలిస్ట్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తమది ప్రజా ప్రభుత్వమని, జర్నలిస్ట్‌లపై దాడులకు చోటు లేదన్నారు. జర్నలిస్ట్‌ల రక్షణకు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. మోహన్ బాబు కుటుంబంలో వివాదం నేపథ్యంలో ఈ వార్తను కవర్ చేసేందుకు జర్నలిస్టులు జల్‌పల్లిలోని మోహన్ బాబు నివాసానికి వెళ్లారు. ఈ సమయంలో జర్నలిస్ట్‌పై మోహన్ బాబు దాడి చేశారు. ఈ ఘటనలో జర్నలిస్ట్ రంజిత్ గాయపడ్డారు. దీనికి సంబంధించి మోహన్ బాబుపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

గురుకులాల ప్రక్షాళన

ప్రతి నెల 10లోపు విద్యా సంస్థలకు నిధులు

డైట్ ఛార్జీలు పెంచాం..విద్యార్థులకు కామన్ డైట్

గురుకులాల సందర్శనలో సీఎం రేవంత్ వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): 'ఇటీవలే గురుకులాల డైట్ ఛార్జీలు పెంచాం. గురుకులాల బాట కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు గురుకులాల విద్యార్థుల కంటే ఎక్కువనే భావన ఉంది. గురుకులాలు అంటే బహుముఖ ప్రతిభకు కేంద్రాలు అనే గుర్తింపు తీసుకురావాలి. గురుకులాల వ్యవస్థను పీవీ నరసింహారావు హయాం లో తీసుకొచ్చారు. టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం ఒకప్పటి గురుకుల విద్యార్థే. మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి కూడా గురుకులాల విద్యార్థే. గురుకులాల విద్యార్థులు ఎందరో ఉన్నతస్థాయికి వెళ్లారు' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా చిలుకూరులో గురుకుల పాఠశాలను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. అనంతరం గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో కామన్ డైట్‌ను ప్రారంభించారు. ప్రైవేట్ స్కూళ్లు వచ్చాక కొంతవరకు గురుకులాల ప్రభావం తగ్గిందని సీఎం అన్నారు. గురుకులాల ప్రక్షాళన కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ సర్కారు డైట్ ఛార్జీలు పెంచలేదని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక గురుకులాల డైట్ ఛార్జీలు పెంచామని పేర్కొన్నారు. 40 శాతం డైట్ ఛార్జీలు, 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలు పెంచడం చరిత్ర అని సీఎం అన్నారు. 16 ఏళ్లలో ఒక్కసారైనా కాస్మోటిక్ ఛార్జీలు పెంచలేదని మండిపడ్డారు. పారు. డైట్ ఛార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామన్నారు. విద్యార్థులపై పెడుతున్న పెట్టుబడి ఖర్చు కాదని, భవిష్యత్తులో పునర్ నిర్మాణం కోసం పెట్టే ఖర్చు అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. గురుకులాల్లో మార్పులు తీసుకు వస్తున్నామని, ఇక్కడి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని సీఎం తెలిపారు. "ఆర్థిక ఇబ్బందుల వల్ల పిల్లలను హాస్టళ్లలో పెడుతున్నారు. మనల్ని నమ్మి తల్లిదండ్రులు పిల్లలను గురుకులాల్లో పెడుతున్నారు. విద్యార్థుల మృతిపై మనం ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, సిబ్బందిపై ఉంది. గతంలో డైట్ విషయంలో బిల్లులు రాలేదని నాణ్యత తగ్గిస్తున్నామని చర్చలు వస్తున్నాయి. ప్రతి నెల 10లోపు గ్రీన్‌ఛానల్ ద్వారా అన్ని విద్యాసంస్థలకు సంబంధించిన నిధులు వస్తాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో ఉచితంగా కరెంట్ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చాం. ప్రతి రోజు అధికారులు డైట్ తిని, నాణ్యత చూడాలని సూచించామన్నారు. 75 ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఐటీఐల్లో చేరితే కచ్చితంగా ఉద్యోగం వస్తుందని అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. రంగారెడ్డి జిల్లాలోనే యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ ఉందని గుర్తు చేశారు. స్కిల్స్ వర్సిటీ దేశానికే ఆదర్శమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు. చిన్నారులతో సీఎం రేవంత్ రెడ్డి కాసేపు ముచ్చటించి, మధ్యాహ్న భోజనం వారితో కలిసి చేశారు.

కాంగ్రెస్ నిర్లక్ష్యం గురుకుల పాలిట శాపం

వరుస ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో కలవరం

నాణ్యమైన ఆహారాన్ని కూడా అందించలేరా?: హరీశ్‌రావు

ఆస్పత్రిలో విద్యార్థిని పరామర్శించిన మాజీ మంత్రి

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): విద్యార్థుల ఆరోగ్యాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, తద్వారా విద్యార్థుల ప్రాణాలు సంకటంగా మారాయని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం.. గురుకుల విద్యార్థులకు శాపంగా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యం పాలై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని లీలావతిని హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 10న కిచిడీ తిని 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. మంచి ఆసుపత్రికి పంపకుండా హాస్టల్‌లో ఉంచి వారికి చికిత్స అందించారని పేర్కొన్నారు. నాలుగు రోజులు గడిచినా అయినా వారు పూర్తి ఆరోగ్యవంతులు కాలేదు. విద్యార్థిని లీలావతిని నిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. తోటి విద్యార్థులతో ఆడుతూ, పాడుతూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన ఆ చిన్నారి.. మౌనంగా ఇలా నిమ్స్ ఆసుపత్రి బెడ్‌పై ఉండటం చూస్తే మనసు కలిచివేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విద్యార్థిని త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం అభం, శుభం తెలియని గిరిజన బిడ్డకు శాపంగా మారింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నది అని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. వాంకిడి గురుకుల విద్యార్థులకు చికిత్స అందించడంలో జరిగిన వైఫల్యం ఇక్కడ కనిపిస్తున్నది. మొన్న శైలజ మృతికి ప్రభుత్వం కారణం అయ్యింది. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్లు జరిగి విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు? రాష్ట్ర వ్యాప్తంగా కాదు, కనీసం సొంత జిల్లా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సైతం పట్టించుకోని నిర్లక్ష్యపు ముఖ్యమంత్రి ఈ రేవంత్ రెడ్డి. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ అభం శుభం తెలియని విద్యార్థులకు శాపం అవుతున్నదని ప్రాణాలను బలిగొంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని సార్లు చెప్పినా అర్థం కావడం లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. విద్యా మంత్రి, ఎస్సీ, ఎస్టీ మంత్రి కూడా రేవంత్ రెడ్డి. ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖల నిర్వహణలో వైఫల్యం. చూడడానికి వెళ్తే ప్రతిపక్ష నాయకులను అడ్డుకుంటారు.

ఎట్లుండే తెలంగాణ ఎట్ల అయింది?

ఆసుపత్రుల్లో బెడ్ల కోసం పిల్లల పోటీ

గురుకుల పిల్లలను చూస్తే బాధేస్తోంది: కేటీఆర్

హైదరాబాద్,డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): ఎట్లుండే తెలంగాణ.. ఎట్ల అయింది.. ముఖ్యంగా గురుకుల పిల్లలను చూస్తే బాధేస్తుందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. సంక్షేమ పాఠశాలలను సంక్షో భ పాఠశాలలుగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కేటీఆర్ ధ్వజమెత్తారు. సామాన్య విద్యార్థుల్లో భయాందోళనలు, తల్లిదండ్రులలో ఆవేదన రేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠాలు చెప్పే చోట పాము కాట్లతో పసిబిడ్డల ప్రాణాలు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులు ఎవరెస్టు వంటి శిఖరాలను అధిరోహిస్తే.. ఏడాది కాంగ్రెస్ పాలనలో ఆసుపత్రి బెడ్లను ఎక్కించారని కేటీఆర్ విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో గురుకుల విద్యాలయాల్లో సీట్ల కోసం పోటీ పడితే ఏడాది కాంగ్రెస్ పాలనలో ఆసుపత్రుల్లో బెడ్ల కోసం పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. దొంగలు పడ్డ ఆరు నెలలకు అన్నట్టు ఇప్పుడు గురుకులాల బాటపట్టారు. గురుకులాల మొక్కుబడి సందర్శన కాదు.. ఆ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టండి. ఫొటోలకు పోజులు ఇవ్వడం కాదు.. పట్టెడు పనికొచ్చే బువ్వ పెట్టి పొట్టలు నింపండి. కెమెరాల ముందు హంగామా చేసుడు కాదు.. గురుకుల బిడ్డల గుండెచప్పుడు వినండి. మంది మార్బలంతో దండయాత్ర చేయకండి.. గురుకుల సమస్యలను తీర్చే ప్రయత్నం చేయండి అని కేటీఆర్ సూచించారు. చివరకు ఎట్లుండె తెలంగాణ.. ఎట్లాయె తెలంగాణ అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

కొడుకు మరణవార్త విని కుప్పకూలిన తల్లి

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి):కొడుకు మరణ వార్త విన్న ఓ తల్లి తల్లడిల్లింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలతో పోరాడుతున్న కొడుకు ఎప్పటికైనా తిరిగొచ్చి అమ్మా.. అంటూ నోరార పిలుస్తాడని ఆశగా ఎదురు చూసింది. కానీ ఆమెకు తీవ్ర నిరుత్సాహమే మిగిలింది. మరణశయ్యపై కొడుకు మృతి చెందాడనే విషయం తెలియగానే తల్లి కూడా కొడుకు శవం పక్కనే కుప్పకూలి మరణించింది. ఈ విషాద ఘటన వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల పరిధిలోని లింగంపల్లిలో జరిగింది. వివరాల్లోకెళ్తే.. లింగంపల్లికి చెందిన మ్యాకల శ్రీశైలం (34) అనే వ్యక్తి గత నెల 24న పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతను ఒక వీడియోలో తన చావుకు కారణం వివరించాడు. లింగంపల్లికి చెందిన బాల్‌రాజ్, లక్ష్మణ్, రాములు కలిసి భూ తగాదాలతో తనను వేధిస్తున్నారని అంతకు ముందే సెల్ఫీ వీడియో తీసుకున్నాడు.

నేనెక్కడికీ పారిపోలేదు

ముందస్తు బెయిల్‌ను హైకోర్టు తిరస్కరించలేదు: మోహన్‌బాబు

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): మంచు మోహన్ బాబు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. జర్నలిస్టుపై దాడి ఘటనకు సంబంధించి హత్యాయత్నం కేసులో స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా మోహన్ బాబు కనిపించలేదని సదరు కథనాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో అజ్ఞాతం వార్తలపై మోహన్ బాబు స్పందించారు. తాను ఎక్కడికీ పారిపోలేదని.. ఇంట్లోనే వైద్య సంరక్షణలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నా ముందస్తు బెయిల్ తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. అందులో ఎలాంటి నిజం లేదు. నేను ఎక్కడికీ పారిపోలేదు. ప్రస్తుతం ఇంట్లో వైద్య సంరక్షణలో ఉన్నాను. వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు వార్తలు రాయొద్దని మీడియాను కోరుతున్నాను' అంటూ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది. మరోసారి.. 'ప్రస్తుతం నేను మా ఇంట్లో వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నాను. నా ముందస్తు బెయిల్‌ను తిరస్కరించలేదు. వాస్తవాలను మాత్రమే బయటపెట్టాలని మీడియాను కోరుతున్నాను' అని మోహన్‌బాబు తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు.

మీడియాను నేనే లోపలికి తీసుకెళ్లా

లోపలికి వెళ్లాక సడెన్‌గా వచ్చి దాడి చేశారు

జర్నలిస్టుపై దాడిపై మంచు మనోజ్ వివరణ

హైదరాబాద్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): జల్ పల్లిలోని మంచు మోహన్ బాబు ఫాంహౌస్ లో ఇటీవల మీడియా ప్రతినిధులపై దాడి జరిగిన విషయం తెలిసిందే. నటుడు మోహన్ బాబు ఓ మీడియా ప్రతినిధి చేతుల్లో నుంచి మైక్ లాక్కుని దాడి చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియ

ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలకు చంద్రబాబు

అమరావతి, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): విశ్వ విఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారకరామారావు సినీ వజ్రోత్సవ వేడుకను కృష్ణా జిల్లా పోరంకిలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్టులుగా ఏపీ సీఎం చంద్రబాబు, భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరయ్యారు. బీజేపీ ఎంపీ పురందేశ్వరి, సీనియర్ నటి జయప్రద, నటుడు కృష్ణంరాజు అర్ధాంగి శ్యామల, సీనియర్ నిర్మాతలు కేఎస్ రామారావు, డి.సురేశ్ బాబు తదితర సినీ రంగ ప్రముఖులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్టీఆర్ తొలి చిత్రం 'మనదేశం' విడుదలై 75 ఏళ్లయిన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్ సైట్ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. 'తారకరామం-అన్న గారి అంతరంగం' అనే పేరుతో ఈ కమిటీ ఓ పుస్తకం కూడా రూపొందించగా... నేటి కార్యక్రమంలో ఆ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. కాగా, ఎన్టీఆర్ తొలి చిత్రానికి నిర్మాతగా వ్యవహరించిన కృష్ణవేణి కూడా ఈ కార్యక్రమానికి హాజరవడం విశేషం.

అల్లు అర్జున్‌కు చంద్రబాబు పరామర్శ

అమరావతి, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): హీరో అల్లు అర్జున్ ను ఏపీ సీఎం చంద్రబాబు ఫోన్ లో పరామర్శించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో అరెస్టై బెయిల్ పై విడుదలైన అల్లు అర్జున్ కు సీఎం చంద్రబాబు ఫోన్ చేశారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. నిన్న అల్లు అరవింద్‌కు కూడా ఫోన్ చేసిన సీఎం చంద్రబాబు.. ధైర్యంగా ఉండాలని సూచించారు. హీరో బాలకృష్ణ, ఎన్టీఆర్, ప్రభాస్ కూడా ఫోన్‌లో అల్లు అర్జున్ ను పరామర్శించారు. అరెస్టుపై విషయాలను అడిగి తెలుసుకున్నారు. బెయిల్ పై విడుదలైన అల్లు అర్జున్ ను టాలీవుడ్ హీరోలు, దర్శకులు, నిర్మాతలు వరుసగా పరామర్శిస్తున్నారు. హీరోలు రానా, నాగ చైతన్య అల్లు అర్జున్ ను పరామర్శించారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్‌పై డైరెక్టర్ రాంగోపాల్ వర్మ మరో ట్వీట్ చేశారు. హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మృతి చెందగా.. ఈ కేసులో అల్లు అర్జున్‌ను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే.. శనివారం ఉదయం బెయిల్‌పై అల్లు అర్జున్ విడుదల అయ్యారు. దాంతో అల్లు అర్జున్ నివాసానికి ఉదయం నుంచి వరుసగా వెళ్తున్న టాలీవుడ్ హీరోలు, దర్శకులు, ప్రొడ్యూసర్లు.. తమ మద్దతు ప్రకటిస్తూ భరోసాగా నిలుస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆర్జీవీ మరో ట్వీట్ చేశారు. "భారత్‌లోనే అతి పెద్ద స్టార్.. తెలంగాణ నివాసి అయిన అల్లు అర్జున్ ఇండియన్ సినిమా హిస్టరీలోనే భారీ హిట్ కొట్టి తెలంగాణ రాష్ట్రానికి గిఫ్ట్‌గా ఇచ్చాడు. కానీ.. తెలంగాణ రాష్ట్రం అతడ్ని జైలుకి పంపించి అతి పెద్ద రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది" అని రాంగోపాల్ వర్మ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌ను అల్లు అర్జున్ ఫ్యాన్స్ వైరల్ చేస్తున్నారు.

సభ్యత్వ నమోదులో టీడీపీ సరికొత్త రికార్డు

73 లక్షలకు చేరుకున్న సభ్యత్వాలు

అమరావతి, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): సభ్యత్వ నమోదులో తెలుగుదేశం పార్టీ సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. అక్టోబర్ 26న సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కాగా.. నేటికి 73 లక్షలకు చేరింది. సభ్యత్వాల నమోదుపై పార్టీ కేంద్ర కార్యాలయంలో నేతలతో చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. నారా లోకేష్ నేతృత్వంలో సభ్యత్వ కార్యక్రమం జరుగుతోంది. సభ్యత్వ నమోదు అంశాలను ఆ విభాగ ప్రతినిధులు చంద్రబాబుకు వివరించారు. నేటికి దాదాపు 73 లక్షల మంది సభ్యత్వం తీసుకోగా..ఇందులో 85 వేల మంది తెలంగాణ రాష్ట్రం నుంచి పొందారు. ఇప్పటి వరకు జరిగిన నమోదులో 54 శాతం మంది కొత్త వారు సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదులో 1.18 లక్షలతో రాజంపేట మొదటి స్థానంలో ఉండగా, నెల్లూరు సిటీలో 1.06 లక్షలు, కుప్పంలో 1.04 లక్షలు, పాలకొల్లులో 1.02 లక్షలు, మంగళగిరిలో 90 వేల సభ్యత్వాలు నమోదయ్యాయి. సభ్యత్వ కార్యక్రమంపై చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యత్వ కార్యక్రమంతో పార్టీ బలమైన కార్యకర్తల ఆర్మీని తయారు చేస్తామని చంద్రబాబు అన్నారు. ప్రతి నలుగురిలో ఒకరు తెలుగుదేశం సభ్యత్వం పొందే పరిస్థితి రావాలన్నారు.

స్వామివారిని దర్శించిన 63,722 మంది

తిరుమల, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు 7 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 9 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న 63,722 స్వామివారిని దర్శించుకోగా 22,225 తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.77 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. టీటీడీ 'దయల్ యువర్ ఈవో' కార్యక్రమం డిసెంబరు 28న ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో నిర్వహిస్తున్నట్లు ఈవో శ్యామల రావు తెలిపారు. భక్తులు తమ సందేహాలను, సూచనలను ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చని, భక్తులు 0877-2263261 అనే నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

2047 విజన్ డాక్యుమెంట్ చారిత్రాత్మక నిర్ణయం

ఏపీ బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ నాయుడు

అమరావతి, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): రాష్ట్రంలో కూటమి తరఫున సీఎం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన 2047 విజన్ డాక్యుమెంట్ ఒక చారిత్రాత్మక నిర్ణయం అని ఏపీ బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ నాయుడు అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా విడుదల చేశారని తెలిపారు. కూటమి మంచి ఆలోచనతో ముందుకు వెళ్తోందన్నారు. గతంలో జగన్మోహన్ రెడ్డి అసత్యపు పాలన, అవినీతి గొడుగు కింద రాష్ట్రంలో పాలన కొనసాగించారని విమర్శించారు. గతంలో సీఎం చంద్రబాబు విజన్ 2020 పెట్టారని.. గతంలో తాము విమర్శించాము కానీ అది 2020 విజన్ నిజం అని తెలుసుకున్నామని చెప్పుకొచ్చారు. 2047 ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శక్తిగా ఎదగాలని కోరుకుంటున్నామన్నారు. సాగునీటి నుంచి వైద్యం వరకు ఏపీ అభివృద్ధి చెందిన లక్ష్యంతో చంద్రబాబు నాయుడు విజన్ 2047 ఏర్పడిందన్నారు. జగన్ ఇష్టానుసారంగా మాట్లాడకుండా ప్రతిపక్ష నాయకుడి హోదా కాపాడుకోవాలని హితవుపలికారు. ఏపీలో కావాల్సిన వనరులు ఉన్నాయన్నారు. ప్రజల అందరినీ దృష్టిలో పెట్టుకొని విజన్ 2047 తీసుకొచ్చారన్నారు. కేంద్రంలో మోదీ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు అభివృద్ధిలో ముందుకు వెళ్తున్నారన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం చీకటి జీవోలు ఇచ్చిందని విమర్శించారు. మాఫియా రాజ్యం పక్కకు వెళ్లి అధికార వికేంద్రీకరణ రాష్ట్రంలో జరుగుతోందన్నారు.

2029లోనే ఎన్నికలు

జమిలి అమల్లోకి వచ్చినా మార్పుండదు.. ఒక దేశం, ఒకే ఎన్నిక విధానానికి మా మద్దతు

రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతోంది

స్వర్ణాంధ్ర విజన్ 2047ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైసీపీ నేతలు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారు

వైసీపీ నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు

మీడియాతో ఇష్టాగోష్టిలో చంద్రబాబు

అమరావతి, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): ఒక దేశం, ఒకే ఎన్నిక విధానానికి ఇప్పటికే మద్దతు ప్రకటించామని.. చంద్రబాబు స్పష్టం చేశారు. మీడియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా జమిలి ఎన్నికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జమిలి అమల్లోకి వచ్చినా, ఎన్నికలు జరిగేది 202 9లోనే అని చెప్పారు. వైసీపీ పబ్బం గడుపుకోవడానికి ఏదిపడితే అది మాట్లాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వైసీపీ నేతలు ప్రజల్లో ఎప్పుడో విశ్వసనీయత కోల్పోయారు. వైసీపీ చేసే నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కొనసాగుతోంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వర్సిటీలు, కళాశాలలు, పాఠశాలలతో పాటు ప్రతిచోటా చర్చ జరగాలి. విజన్ 2020 సాకారమైన తీరు నేటి తరం తెలుసుకోవాలి. గత పరిస్థితులను బేరీజు వేస్తే విప్లవాత్మక మార్పులు అందరికి కనిపిస్తున్నాయి' అని చంద్రబాబు వివరించారు. '2047 లోనూ ఇదే పునరావృతం అవుతుంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్ ఒక రోజు పెట్టి వదిలేసేది కాదు. భవిష్యత్ తరాల బాగు కోసం చేసే ప్రయత్నంలో అందరు భాగస్వామ్యం కావాలి. రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్ 2047. సాగునీటి సంఘాలు, సహకార, ఇతరత్రా ఎన్నికలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతున్నాయి. ఈసారి కలెక్టర్ల సదస్సులో ఎన్నో మార్పులు తీసుకొస్తాం' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'సుదీర్ఘ సమీక్షలకు తావివ్వకుండా ప్రశ్నలు, సమాధానాల రూపంలో నిర్వహిస్తాం. ముందుగానే కలెక్టర్లు, ఎస్పీలకు చర్చ అంశాలు పంపి సమాధానాలు కోరతాం. సమయం సద్వినియోగం, మంత్రులు, అధికారుల మధ్య సమన్వయం పెరుగుతుంది. ఆస్పత్రిలో చేరిన అద్వానీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. అద్వానీ నాకు దశాబ్దాలుగా అనుబంధం ఉంది. ఆనాడు ఏపీ అభివృద్ధిలో అద్వానీ సహకారం మరువలేనిది' అని చంద్రబాబు గుర్తుచేశారు. రేపటి తరం భవిష్యత్తు కోసమే విజన్-2047 అని చెప్పుకొచ్చారు. స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంటను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. 1996 నాటి ఏపీ పరిస్థితులు.. 2020 నాటి పరిస్థితులు బేరీజు వేస్తే విప్లవాత్మక మార్పులు కనిపిస్తాయన్నారు. 2047లోనూ ఇదే పునరావృతం అవుతుందన్నారు సీఎం చంద్రబాబు. మరోవైపు సభ్యత్వం నమోదులో టీడీపీ న్యూ రికార్డ్ క్రియేట్ చేసింది. సభ్యత్వ నమోదుపై టీడీపీ ఆఫీసులో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కార్యకర్తల సంఖ్య ప్రస్తుతం 73 లక్షలకు చేరుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇక సభ్యత్వ నమోదులో టాప్ -5లో రాజంపేట, నెల్లూరు, కుప్పం, పాలకొల్లు, మంగళగిరి నియోజకవర్గాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఎప్పుడూ లేని విధంగా ఈసారి యువత, మహిళలు సభ్యత్వాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పార్టీలో ఉన్నామంటే కుదరదని, పనితీరు ఆధారంగా గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీకి, ప్రజలకు సేవ చేయనివారికి పదవులు కావాలని కోరడం సరికాదన్నారు. పదవులు వచ్చాయని కొందరు పార్టీని నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రజలకు సేవ చేస్తేనే రాజకీయాల్లో కొనసాగుతారని చెప్పుకనే చెప్పేశారు సీఎం చంద్రబాబు.

మళ్లీ అరచేతిలో బాబు వైకుంఠం

మోదీ, చంద్రబాబు, జగన్ కలిసి రాష్ట్రానికి అన్యాయం

విజన్లు కాదు.. విభజన హామీలు కావాలి

ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల విమర్శలు

అమరావతి, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): విజన్ 2047 పేరుతో చంద్రబాబు మళ్లీ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని.. ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ దశ - దిశ మారాలంటే తక్షణం కావాల్సింది విజన్లు కాదు.. విభజన హామీలు అని వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని నెంబర్ 1గా నిలపాలంటే నెరవేరాల్సింది కేంద్రం ఇచ్చిన హామీలని స్పష్టం చేశారు. దశాబ్ద కాలంగా విభజన హామీలను గాలికి వదిలేశారు.. పూర్తిగా అటకెక్కించారని ఫైర్ అయ్యారు'రాష్ట్ర విభజన సమయంలో అనాడు యూపీఏ సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా హామీ ఇచ్చింది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చింది. నూతన రాజధానికి పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం ఇవ్వాలని సూచించింది. బుందేల్ ఖండ్ తరహాలో వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటన చేసింది. మౌలిక సదుపాయాల కల్పన, పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని షెడ్యూల్ 13 లో పొందపరించింది' అని షర్మిల వివరించారు. 'కడప స్టీల్, దుగ్గరాజుపట్నం పోర్టులను నిర్మిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం విభజన చట్టంలో పొందపరించింది. నూతన రైల్వే జోన్, పెట్రోలియం యూనివర్సిటీ, విశాఖ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, విజయవాడ, విశాఖలో మెట్రో రైల్, హైదరాబాద్ నుంచి విజయవాడకు ర్యాపిడ్ రైల్, ఇలా ఎన్నో హామీలు నేటికీ కలగానే మిగిలాయి. ఇవ్వాల్టికి ఒక్క హామీకి దిక్కులేకుండా పోయింది' అని షర్మిల ట్వీట్ చేశారు. 'గడిచిన 10 ఏళ్లలో ప్రత్యేక హోదా వచ్చి ఉంటే పన్నుల్లో రాయితీలు ఉండేవి. వేల సంఖ్యలో కొత్త పరిశ్రమలు వచ్చేవి. లక్షల్లో ఉపాధి అవకాశాలు లభించేవి. పోలవరం ప్రాజెక్టు పూర్తి అయ్యి ఉంటే రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేది. విజయవాడ, విశాఖలో మెట్రో రైల్ నిర్మాణం జరిగితే ప్రధాన నగరాలుగా అభివృద్ధి చెందేవి. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు అంది వుంటే పేదరిక నిర్మూలన సాధ్యం అయ్యేది. విభజన హామీలు అమలయ్యి ఉంటే రాష్ట్రం దిశ - దశ పూర్తిగా మారేది. దేశంలో నెంబర్ 1 రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ విరాజిల్లేది' అని షర్మిల వ్యాఖ్యానించారు. విభజన చట్ట హామీలు బుట్టదాఖలు చేయడంలో ప్రధాన ముద్దాయి ప్రధాని నరేంద్ర మోదీ అయితే, రెండో ముద్దాయి చంద్రబాబు, మూడో ముద్దాయి జగన్ మోహన్ రెడ్డి. ఈ ముగ్గురు కలిసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారు. హోదా 5 ఏళ్లు కాదు 10 ఏళ్లు ఇస్తామని మోదీ నమ్మబలికితే.. హోదా ఏమైనా సంజీవనా అని చంద్రబాబు చెవుల్లో పూలు పెట్టారు' అని సైటైర్లు వేశారు.

జగన్ ఆస్తుల కేసులో కీలక పరిణామం

సుప్రీంకోర్టుకు సీబీఐ, ఈడీ నివేదిక

అక్రమాస్తుల కేసు బదిలీ, బెయిల్ రద్దుపై విచారణ

జనవరి 10కి తదుపరి విచారణ వాయిదా

మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆయన కేసులకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను సుప్రీంకోర్టుకు సీబీఐ, ఈడీ అందజేశాయి. ఆ నివేదికను పరిశీలించిన తరువాతే తీర్పు ఇస్తామని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అనంతరం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల బదిలీ, బెయిల్ రద్దు పిటిషన్లపై విచారణ జనవరి 10 వాయిదా పడింది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేసుల విచారణలో జాప్యంపై అఫిడవిట్ రూపంలో నివేదికను సీబీఐ, ఈడీ దాఖలు చేశాయి. కేసుల జాప్యానికి గల కారణాలను అఫిడవిట్‌లో దర్యాప్తు సంస్థలు వివరించాయి. వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణ ఆలస్యం అవుతోందని, వేగవంతంగా ట్రయల్ పూర్తి చేసేందుకు తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని.. లేకపోతే కేసుల విచారణపై తీవ్ర ప్రభావం పడుతుందని మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లను శుక్రవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ కూడిన ధర్మాసనం విచారించింది. సీబీఐ, ఈడీ తరపు న్యాయవాది అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జీ) రాజ్‌కుమార్ భాస్కర్ ఠాక్రే వాదనలు వినిపిస్తూ సీబీఐ, ఈడీ కేసుల స్టేటస్ వివరాలు గురువారం సాయంత్రం ఫైల్ చేసినట్లు ధర్మాసనానికి తెలిపారు. దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన స్టేటస్ రిపోర్ట్ కాపీ తాము పరిశీలి స్తామని ధర్మాసనం తెలిపింది. తాము కూడా పరిశీ లించడానికి కొంత సమయం కావాలని వైఎస్ జగన్మోహన్ రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి కోరారు. వైఎస్ జగన్ కేసుల విచారణ లో ఎందుకు జాప్యం జరుగుతుందని గతంలో దర్యాప్తు సంస్థలను సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నిం చింది. కేసుల స్టేటస్‌ను వివరిస్తూ నివేదిక ఇవ్వాలని ఈనెల 2 (సోమవారం) న విచారణ సందర్భంగా దర్యాప్తు సంస్థలను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సుప్రీంకోర్టు ఆదేశాలతో జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో సీబీఐ, ఈడీ కేసుల పురోగతిని, ప్రస్తుత పరిస్థితి, గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశాలు, ఆ తరువాత పరిణామాలతో అఫిడవిట్ రూపం లో స్టేటస్ రిపోర్టును దర్యాప్తు సంస్థలు దాఖలు చేశాయి. సిబిఐ, ఈడీ ఇచ్చిన నివేదికలను పరిశీలించిన తీర్పు ఇస్తామని తరువాత జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం స్పష్టం చేసింది. జగన్ అక్రమాస్తులు వ్యవహారంలో మొత్తం 125 పిటిషన్లపై విచారణ పెండింగ్‌లో ఉన్నాయి. ట్రైల్ కోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకు దాఖలైన పిటిషన్లలో దాదాపు 80 శాతం పిటిషన్లు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ విషయం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం ముందు దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన అఫిడవిట్‌లో వెల్లడి అయ్యాయి. రఘురామ కృష్ణరాజు తరపున న్యాయవాది బాలాజీ శ్రీనివాసన్ హాజరయ్యారు.

ఏపీవైపు దూసుకొస్తున్న అల్పపీడనం

పలు జిల్లాల్లో గజగజలాడిస్తోన్న చలి

అమరావతి, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఆదివారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ఆ తర్వాత అల్పపీడనం మరింత బలపడి తమిళనాడు తీరం వైపు కదిలే అవకాశం ఉంది. మరోవైపు రెండు తెలుగు రాష్ట్రాలను చలి చంపేస్తుంది. సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి ఉష్ణోగ్రతలు. పొగమంచు ప్రభావం విమాన రాకపోకలపై తీవ్రంగా పడుతుంది.. రెండో రోజూ పలు విమానాలు ఆలస్యమయ్యాయి. ఇటీవలే బంగాళాఖాతంలో అల్పాడానికి తమిళనాడుతో పాటు రాయలసీమ దక్షిణ కోస్తా తీవ్రంగా వర్షాలు కురిసాయి. ఆయా ప్రాంతాల్లో పంటలకు కూడా నష్టం వాటిలో ఉంది. ఆ ప్రభావం నుంచి కాస్త ఊపిరి పీల్చుకునేలోపే.. మరో అల్పపీడనం ఉపద్రవం ముంచుకొస్తుంది. దక్షిణ అండమాన్ పరిసర ప్రాంతాలపై ఉపలతల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఆదివారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ఇది తదుపరి రెండు రోజుల్లో మరింత బలపడి పశ్చిమ వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉంది. ఈ అల్పపీడనం కూడా తమిళనాడు తీరం వైపే కదిలే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఏపీ, యానాంలపై ఈశాన్య తూర్పు గాలుల ప్రభావం కనిపిస్తోంది. శనివారం నుంచి మూడు రోజులపాటు దక్షిణ కోస్తా, రాయలసీమలో తేలికనుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉత్తర కోస్తాలో ఎల్లుండి నుంచి వస్తారు వర్షం ప్రభావం కనిపిస్తుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఇక రెండు తెలుగు రాష్ట్రాలను చలి చంపేస్తుంది. గజగజ వణికిస్తోంది. పగటిపూట ఉష్ణోగ్రతలో క్రమంగా పడిపోతున్నాయి. కొన్నిచోట్ల సింగల్ డిజిట్‌కు పడిపోతున్నాయి ఉష్ణోగ్రతలు. అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో భారీగా చలి తీవ్రత కనిపిస్తోంది. దట్టంగా పొగమంచు కురుస్తోంది. మినుములూరులో 8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. పాడేరు, అరకులలో 10 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎముకలు కోరికే చలిలో గిరిజనులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

తిరుమలలో 10 రోజుల పాటు ప్రత్యేక దర్శనాలు రద్దు

అమరావతి, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): టీటీడీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి బీఆర్ నాయుడు తిరుమల వ్యవహారాల్లో తనదైన ముద్రవేస్తున్నారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామని ఆయన తొలి రోజు నుంచి చెబుతున్నారు. ఈ క్రమంలో తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. జనవరి 10 నుంచి 19 వరకు తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు కల్పిస్తున్నట్టు బీఆర్ నాయుడు నేడు ఒక ప్రకటనలో వెల్లడించారు. అయితే, ఈ సమయంలో అన్ని రకాల ప్రత్యేక దర్శనాలు రద్దు చేస్తున్నట్టు తెలిపారు. టోకెన్లు కలిగిన భక్తులకు మాత్రమే స్వామివారి దర్శనాలకు అనుమతి ఇస్తున్నట్టు స్పష్టం చేశారు. ఎంతో విశిష్టత కలిగిన వైకుంఠ ఏకాదశి పర్వదినం నేపథ్యంలో తిరుమల ఆలయంలో ప్రతి ఏడాది వైకుంఠ ద్వార దర్శనాలు కల్పిస్తుండడం తెలిసిందే. ఈ మేరకు టీటీడీ ఇప్పటి నుంచే విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. సామాన్య భక్తులను దృష్టిలో పెట్టుకుని కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రజాప్రతినిధులు, మాజీ అధికారులు, అంతేకాకుండా, పసిబిడ్డలు, దివ్యాంగులు, వృద్ధులు, రక్షణ శాఖ, ఎన్నారై తదితర విశేష దర్శనాలను ఈ పది రోజుల పాటు రద్దు చేస్తున్నామని బీఆర్ నాయుడు వివరించారు. ఇక... దర్శన టోకెన్లు, స్పెషల్ దర్శన్ టికెట్లు ఉన్న భక్తులను మాత్రమే దర్శనాలకు అనుమతిస్తామని... టోకెన్లు లేని భక్తులను తిరుమల కొండపైకి అనుమతిస్తాం కానీ, స్వామి వారి దర్శనానికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. భక్తులకు కేటాయించిన టైమ్ స్లాట్ ప్రకారం, నిర్దిష్ట సమయానికి క్యూలైన్ల వద్దకు చేరుకోవాలని సూచించారు. గతంలో మాదిరిగా భారీ క్యూలైన్లు ఇక ఉండవని, ఈసారి సాధ్యమైనంత మేర గరిష్ఠ సంఖ్యలో భక్తులకు స్వామివారి దర్శనం కల్పించే ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

కూటమి ప్రభుత్వం ఎప్పుడూ రైతుల పక్షానే: నాదెండ్ల మనోహర్

అమరావతి,డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరిస్తూ.. అండగా ఉంటుందని ఏపీ పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వైసీపీ నేతలపై ట్విట్టర్(ఎక్స్) వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు రైతులకు భరోసాగా నిలుస్తు న్నారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. వైసీపీ పాలనలో గత ఖరీఫ్ సీజన్లో డిసెంబర్ 13నాటికి- 9,40,936 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్ర మే సేకరణ చేసిందని.. కూటమి ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్లో ఇప్పటి వరకూ 16,34,151 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించిందని వివరించా రు. కలెక్టరేట్ల దగ్గరకు బస్తాలు మోసుకువెళ్లి వైసీపీ నేతలు ఫొటోషూట్ చేశారని విమర్శించారు. గత సీజన్లో గుంటూరు, విశాఖపట్నం, అనకాపల్లి, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో కనీసం సేకరణ ఎందుకు చేపట్టలేదని అన్నారు. కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ధాన్యం కొనుగోలులో అనేక సంస్కరణలు తీసుకువచ్చినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రైతులకు బకాయిలు చెల్లించకుండా వారిని మోసం చేసిందని ఆయన ఆగ్రహించారు. గత ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను సైతం చంద్రబాబు సర్కారే చెల్లించినట్లు మంత్రి నాదెండ్ల వెల్లడించారు. ఈ ఏడాది సంక్రాంతి రాకముందే రైతులు కళ్లల్లో ఆనందం కనపడుతోందని మంత్రి చెప్పారు. రైతులకు అండగా నిలబడకపోతే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లక్షల కోట్ల బడ్జెట్ వృథాగా మారుతుందన్నారు. అందుకే వారిని ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో కంటే కూటమి ప్రభుత్వంలో ధాన్యం దిగుబడి అధికంగాఉందన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తే ఎక్కువ మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ధాన్యం అమ్మకాల్లో రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని చెప్పారు. అలా ఆందోళన చెంది దళారులకు తక్కువ ధరకే విక్రయించవద్దని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర దక్కాల్సిందేనని అన్నారు. అందుకు ప్రభుత్వం అన్నీ చర్యలు చేపట్టిందని... ధాన్యంలో తేమ 20 శాతం వరకు ఉన్నా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వర్షం వస్తే ధాన్యం

డిమాండ్ల సాధన కోసం
రైతుల ఉద్యమబాట

చలో ఢిల్లీ మార్చ్‌కు పిలుపు.. అడ్డుకున్న పోలీసులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): తమ డిమాండ్ల పరిష్కారానికై రైతులు మరోసారి ఉద్యమబాట పట్టారు. ఇవాళ మధ్యాహ్నం 'చలో ఢిల్లీ' మార్చ్‌ను ప్రారంభించారు. కనీస మద్దతు ధర సహా 11 డిమాండ్ల సాధన కోసం 101 మంది రైతులు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. అయితే, రైతులను శంభు సరిహద్దు వద్ద హర్యాణా పోలీసులు అడ్డుకున్నారు. రైతులపై బాష్పవాయువు, జల ఫిరంగులను ప్రయోగించారు. దీంతో సరిహద్దు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇక రైతుల ఢిల్లీ చలో మార్చ్‌ను అడ్డుకోవడం ఇది మూడోసారి. డిసెంబర్ 6 నుంచి ఢిల్లీ వైపుకు వెళ్లేందుకు రైతులు ప్రయత్నించగా.. ఇప్పటికే ఆ ప్రయత్నాలను రెండుసార్లు పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో పోలీసుల తీరుపై రైతులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక రైతుల ఢిల్లీ మార్చ్ నేపథ్యంలో హర్యాణా ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి 17వ తేదీ అర్ధరాత్రి వరకూ సేవలు నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కావాలని రైతులు ప్రధానంగా కోరుతున్నారు. రుణ మాఫీ చేయాలని, రైతులు, రైతు కూలీలకు పెన్షన్ ఇవ్వాలని, విద్యుత్ చార్జీలు పెంచరాదని, రైతులపై పెట్టిన పోలీస్ కేసులు ఎత్తివేయాలని, 2021 లఖింపూర్ ఖీరి బాధితులకు న్యాయం చేయాలని, భూ సేకరణ చట్టం 2013ను పునరుద్ధరించాలని, ఆందోళనలో మరణించిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

బీజేపీ రాజ్యాంగాన్ని
రక్షిస్తాననడం విడ్డూరం

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్య

న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ఉండాలని వీడీ సావర్కర్ చెబితే ఇప్పుడు బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని రక్షిస్తామని అనడం విడ్డూరంగా ఉందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రాజ్యాంగంపై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో రాహుల్ పాల్గొన్నారు. రాజ్యాంగంలో అసలు భారతీయతే లేదనీ, దాని స్థానంలో మనుస్మృతి ఉండాలని ఆర్?ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్ చెప్పిన మాటలను రాహుల్ గుర్తు చేశారు. ఏకలవ్యుడి బొటనవేలిని ద్రోణుడు నరికించినట్లే అదానీ, అంబానీ లాభం కోసం చిన్న వ్యాపారుల వేలిని బీజేపీ కత్తిరించిందని రాహుల్ వ్యాఖ్యానించారు. అగ్నివీర్, ప్రశ్నపత్రాల లీక్‌ల ద్వారా యువత బొటనవేలిని కత్తిరించారని మండిపడ్డారు. మద్దతుధర కోసం ఉద్యమిస్తున్న రైతుల బొటనవేలిని కత్తిరించారని దుయ్యబట్టారు. సామాజిక, ఆర్థిక సమానత్వం లేకుంటే రాజకీయ సమానత్వం ఉండదని అంబేద్కర్ చెప్పారన్న రాహుల్, కులగణనతో సమానత్వం వైపు అడుగులేస్తామని తెలిపారు. మతం, జాతి, కులం, లింగం లేదా జన్మస్థలం ఆధారిత వివక్షను నిషేధించాలని రాజ్యాంగం చెబితే బీజేపీ మాత్రం విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని తెలిపారు. మనుస్మృతి వంటి ప్రాచీన విధానాలతోనే దేశం నడవాలని బీజేపీ కోరుకుంటోందని ఆరోపించారు. రాజ్యాంగం గురించి, భారతదేశాన్ని ఎలా నడపాలని ఆర్ఎస్ఎస్ సుప్రీం లీడర్ సావర్కర్ భావించారో చెబుతూ నా ప్రసంగాన్ని ప్రారంభించాలనుకుంటున్నాను. "రాజ్యాంగంలో చెత్త విషయం ఏమిటంటే, దానిలో భారతీయత ఏమీ లేదు. మనుస్మృతి అనేది మన హిందూ దేశానికి వేదాల తర్వాత అత్యంత పూజనీయమైనది. మన ప్రాచీన కాలం నుంచి మన సంస్కృతి, ఆచారాలు, ఆలోచనలు, ఆచరణలకు ఆధారమైంది." ఇవి సావర్కర్ చెప్పిన మాటలు. సావర్కర్ తన రచనల్లో మన రాజ్యాంగంలో భారతీయత ఏమీ లేదని స్పష్టంగా చెప్పారు. రాజ్యాంగాన్ని మనుస్మృతితో భర్తీ చేయాలని ఆయన చెప్పారు. దానికి వ్యతిరేకంగానే మేం పోరాటం చేస్తున్నామన్నారు. మరోవైపు, భారత్‌లో అందరికీ సమాన ఓటు హక్కు ఉన్నప్పటికీ ఇక్కడ మైనారిటీలకు ఎలాంటి హక్కులు ఉండడం లేదని దుష్ప్రచారం చేయడం సరికాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజూ విపక్షాలకు హితవు పలికారు. 75 ఏళ్ల రాజ్యాంగ ప్రస్తానంపై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో మాట్లాడిన రిజిజూ మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్‌తోపాటు ప్రభుత్వాలు కూడా ఎంతో కృషి చేశాయని చెప్పారు. ఇప్పుడు విపక్షాలు వారి వ్యాఖ్యలతో అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠను దిగజార్చవద్దని హితవు పలికారు. భారత్‌లో మైనారిటీలకు చట్టబద్ధమైన భద్రత ఉందన్న మంత్రి ప్రభుత్వం ఆ నిబంధనకు కట్టుబడి ఉందని వివరించారు. ఐరోపా దేశాల్లో 48 శాతం మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింలు వివక్ష ఎదుర్కొంటున్నారని ఒక సర్వేలో తేలిందన్నారు. ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల్లో బుర?లు ధరించిన ముస్లింలపై అభ్యంతరం వ్యక్తం అవుతోందని గుర్తుచేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌లోని సిక్కులు, హిందువులు, క్రైస్తవుల పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలిసిందేనని వివరించారు. టిబెట్‌లో అయినా మయన్మార్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌లో అయినా– మైనారిటీల పట్ల అణచివేత జరిగితే, వారికి ఏదైనా కష్టం వస్తే వారు రక్షణ పొందేందుకు మొదట వచ్చే దేశమేదైనా ఉందంటే అది భారతదేశమే. ఇది సురక్షితం కాబట్టే ఇక్కడకు వస్తారు. అలాంటప్పుడు ఈ దేశంలో మైనారిటీలకు భద్రత లేదని ఎలా అంటారు? మైనారిటీ, మెజారిటీ వ్యక్తుల మధ్య, ప్రతీ ఇంట్లో ప్రతీ కుటుంబంలో చిన్న చిన్న గొడవలు రావడం సహజం. అంతమాత్రాన దేశ ప్రతిష్టను దెబ్బతీసే మాటలు మాట్లాడకూడదు. ఒక పార్టీ కోసం ఈ మాట చెప్పడం లేదు, దేశం కోసం చెబుతున్నారాణి అన్నారు.

రైతు పేరు కూడా ఉచ్చరించే
అర్హత జగన్‌కు లేదు

రైతు ఆత్మహత్యల్లో మొదటి స్థానాల్లో నిలబెట్టిన ఘనత జగన్‌ది

మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

అమరావతి, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రైతు అనే పేరు ఉచ్చరించే అర్హత కూడా లేదని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రాన్ని మొదటి స్థానానికి తీసుకెళ్లిన ఘనత జగన్‌దని విమర్శించారు. శనివారం నెల్లూరులో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... వ్యవసాయ శాఖను చంపేసి, సూక్ష్మ సేద్యం, పోషకాలు, ఇతరత్రా రైతు ప్రోత్సాహకాలు దూరం చేశారని ఆగ్రహించారు. జగన్ వల్ల వ్యవసాయ రంగం ఎంత నష్టపోయిందో పులివెందుల రైతులే చెబుతారని అన్నారు. వ్యవసాయ శాఖపై శ్వేతపత్రం విడుదలకు తాము సిద్ధం, జగన్ సిద్ధమా అని సవాల్ విసిరారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌లో వ్యవసాయానికి, రైతాంగానికి పెద్దపీట వేశామన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో గోళ్లు గిల్లుకుంటూ కూర్చుని రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్ ఏనాడైనా వ్యవసాయ శాఖపై సమీక్ష జరిపారా అని ప్రశ్నించారు. ఏ2, ఏ2 వియ్యంకుడి సాయంతో రేషన్ బియ్యం విదేశాలకు పంపి కోట్లు దండుకోవటం ఒక్కటే జగన్ చేశారని ఆరోపించారు. దేశంలో రైతులపై తలసరి సగటు అప్పు రూ. 74500 ఉంటే.. ఏపీలో 2.45లక్షలు ఉండటానికి కారణం జగన్ కాదా అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రశ్నించారు. మరోవైపు.. కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరిస్తూ.. అండగా ఉంటుందని ఏపీ పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వైసీపీ నేతలపై ట్విట్టర్(ఎక్స్) వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేంద్ర మాజీ మంత్రి ఇళంగోవన్ కన్నుమూత

చెన్నై, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): తమిళనాడు కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర మంత్రి ఈవీకేఎస్ ఇళంగోవన్ శనివారం కన్నుమూశారు. ఆయన వయసు 73 ఏళ్లు. స్వల్ప అనారోగ్యం కారణంగా ఆయన గత కొన్ని రోజుల నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నవంబర్ 13వ తేదీన ఎంఐఓటీ హాస్పిటల్‌లో చేరారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆయన.. నెల రోజుల నుంచి చికిత్స తీసుకుంటున్నారు. 2023 ఫిబ్రవరిలో జరిగిన ఉప ఎన్నికల్లో.. ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గం నుంచి ఆయన అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆయన కుమారుడు తిరుమగన్ ఇవెర మృతిచెందిన నేపథ్యంలో అక్కడ ఉప ఎన్నిక నిర్వహించారు. ద్రావిడ ఉద్యమ నేత పెరియార్ ఈవీ రామస్వామి సోదరుడి మనవడే ఇళంగోవన్. చిన్న వయసులోనే ఇళంగోవన్ రాజకీయ ఎంట్రీ చేశారు. 1984లో ఆయన తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2004లో ఆయన లోక్‌సభకు ఎన్నికయ్యారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో ఆయన కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రిగా చేశారు. తమిళనాడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కూడా చేశారు.

మీడియాలో అతిశయోక్తులు వద్దు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో 'వీఐపీ దర్శనం' పేరుతో అదనపు రుసుం వసూలుచేసే పద్ధతికి వ్యతిరేకంగా దాఖలైన పిల్‌పై తాము జరిపిన విచారణ గురించి కొన్ని పత్రికల్లో 'తప్పుడు సమాచారం' రావడంపై సుప్రీంకోర్టు శుక్రవారం అసంతృప్తి వ్యక్తం చేసింది. విజయ్ కిశోర్ గోస్వామి అనే వ్యక్తి దాఖలు చేసిన ఈ పిల్‌ను అక్టోబరు 25న విచారించిన ప్రస్తుత సీజేఐ జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌ల ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసింది. "గతంలో కోర్టులో జరిగిన విచారణను పూర్తిగా తప్పు చూపించారు. విచారణ సమయంలో సందర్భానుసారం వివిధ ప్రశ్నలు తలెత్తుతాయి. వాటిని మీడియాలో తప్పుగా, అతిశయోక్తులతో చూపించారాదు. ఈ పరిస్థితి దేశవ్యాప్తంగా ఉంది" అని ధర్మాసనం పేర్కొంది. కేసు తదుపరి విచారణను 2025 జనవరి 27కు వాయిదా వేశారు. 'ప్రత్యేక దర్శనం' పేరిట రూ.400 నుంచి రూ.500 వసూలు చేయడం సంపన్న భక్తులకు, సాధారణ ప్రజలకు మధ్య విభజనను చూపడమేనని.. ఆలయ ప్రాంగణాల్లో అందరినీ సమదృష్టితో చూసేలా కేంద్రం ఆదేశాలు జారీ చేయాలని పిటిషనరు కోరుతున్నారు.

ఢిల్లీ పాఠశాలలకు బాంబు బెదిరింపులు

ఆందోళన చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. శుక్రవారం దాదాపు 30 పాఠశాలలకు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం ఉదయం కూడా పలు స్కూళ్లకు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ఆర్కేపురం, వసంత్ కుంజ్ ప్రాంతాల్లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సహా పలు పాఠశాలలు బెదిరింపులు వచ్చాయి. శనివారం ఉదయం 6:12 గంటల ప్రాంతంలో బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో అప్రమత్తమైన ఆయా పాఠశాలల యాజమాన్యం వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు పాఠశాలల వద్దకు చేరుకొని విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పాఠశాలల ఆవరణల్లో తనిఖీలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ లభించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, స్కూళ్లలో బాంబులు ఉన్నాయంటూ బెదిరింపులు రావడంతో ఈ వారంలో ఇది మూడోసారి కావడం గమనార్హం. వరుస బెదిరింపులతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

యువకుడిపై పెట్రోల్ పోసి
నిప్పంటించిన స్నేహితులు..!

జైపూర్, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): రాజస్థాన్‌లో దారుణం వెలుగుచూసింది. జైపూర్ జిల్లాలో స్నేహితుల మధ్య తలెత్తిన చిన్న వివాదం ఓ యువకుడి ప్రాణాలను బలిగొంది. ఈ సంఘటన గురువారం(డిసెంబర్ 12) సాయంత్రం 7 గంటల సమయంలో బగ్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంసింగ్‌పురా గ్రామం లో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.బెగుసరాయ్ రోడ్‌లోని నిర్జన ప్రదేశంలో కూర్చున్న కొంతమంది యువకుల మధ్య ఏదో సమస్యపై గొడవ ప్రారంభమైంది. వివాదం తీవ్ర స్థాయికి చేరుకుంది. దీంతో ఓ యువకుడిపై తోటి స్నేహితులే పెట్రోల్ పోసి సజీవ దహనం చేశారు. మంటల్లో యువకుడు కేకలు వేయడం గమనించిన చుట్టుపక్కల వారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, 108 అంబులెన్స్ సంఘటనా స్థలానికి చేరుకుంది. అయితే అప్పటికే యువకుడు తీవ్రంగా కాలిపోయాడు. గాయపడిన యువకుడిని ఎస్ఎంఎస్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు అధికారి డీసీపీ అమిత్ బుదానియా, ఏసీపీ హేమేంద్ర శర్మ, థానదికారి మోతీలాల్ శర్మ విచారణ ప్రారంభించారు. ఘటనా స్థలంలో ఎఫ్ఎస్ఎల్ బృందం ఆధారాలు సేకరించింది. మృతుడు రాకేష్ గుర్జార్‌గా పోలీసులు గుర్తించారు. అతని తండ్రి మోహర్ సింగ్ గుర్జార్ బగ్రు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో రాకేశ్ స్నేహితులు మనోజ్ కుమావత్, హరిమోహన్ మీనా అతడిని ఇంటి నుంచి తీసుకెళ్లారు. సాయంత్రం రాకేశ్‌పై పెట్రోల్ పోసి తగులబెట్టినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. రాకేష్ సహచరులలో ఒకరు ఈ ఘటనను వీడియో తీశారని మోహర్ సింగ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వీడియోలో, చనిపోయే ముందు, మనోజ్ కుమావత్, హరిమోహన్ మీనా కలిసి తనను కాల్చారని రాకేశ్ ఆరోపించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. అయితే ఈ ఘటనపై పోలీసులు ఇంకా ఎలాంటి అధికారిక సమాచారాన్ని వెల్లడించలేదు. మృతుని మృతదేహానికి మెడికల్ బోర్డు నుంచి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. నిందితులను పట్టుకుని కేసును లోతుగా విచారించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

భారత సంతతి ఓపెన్‌ఏఐ మాజీ ఉద్యోగి ఆత్మహత్య

న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): భారత సంతతికి చెందిన ఓపెన్‌ఏఐ మాజీ ఉద్యోగి సుచిర్ బాలాజీ ఆత్మహత్య చేసుకున్నాడు. శాన్‌ఫ్రాన్సిస్కోలో 26 ఏళ్ల ఆ వ్యక్తి అనుమానాస్పద రీతిలో మరణించాడు. నగరంలోని బుచానన్ స్ట్రీట్ అపార్ట్‌మెంట్‌లో సుచిన్ బాలాజీ మృతదేహాన్ని గుర్తించారు. అతను సూసైడ్ చేసుకున్నట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు. మరణం వెనుక ఎటువంటి ఆధారాలు లేవని పోలీసులు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పేరుగాంచిన ఓపెన్‌ఏఐ సంస్థలో జరుగుతున్న అక్రమాలను సుచిర్ బాలాజీ వెలుగులోకి తెచ్చాడు. ఆ కంపెనీ అనుసరిస్తున్న వ్యాపార విధానంపై ఇప్పటికే పలు దావాలు దాఖలు అయ్యాయి. ఓపెన్‌ఏఐ సంస్థ అమెరికా కాపీరైట్ చట్టాలను ఉల్లంఘించినట్లు మూడు నెలల క్రితం సుచిర్ బాలాజీ ఆరోపించారు. ఆ కంపెనీ అక్రమరీతిలో చాట్‌జీపీటీ డెవలప్ చేసినట్లు అతను పేర్కొన్నాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామ్‌కు చెందిన చాట్‌జీపీటీ టెక్నాలజీ ద్వారా ప్రస్తుతం లక్షలాది మంది డబ్బులు ఆర్జిస్తున్నారు. ఓపెన్‌ఏఐ సంస్థ వ్యాపారవేత్తలను, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను వేధిస్తున్నట్లు బాలాజీ ఆరోపించారు. సమాజానికి హాని చేసే సంస్థలో ఉండకూడదన్న ఉద్దేశంతో ఓపెన్‌ఏఐ సంస్థను బాలాజీ వదిలివెళ్లాడు.

మైనార్టీల పట్ల ఎటువంటి వివక్ష లేదు : కిరణ్‌రిజిజు

న్యూఢిల్లీ, డిసెంబర్ 14 (ఋషి ప్రతినిధి): మైనార్టీల పట్ల ఎటువంటి వివక్ష ప్రదర్శించడం లేదని, వారి అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. లోక్‌సభలో రాజ్యాంగంపై జరుగుతున్న చర్చలో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించడం జరిగిందన్నారు. ఫ్రాన్స్, స్పెయిన్, ఇండోనేషియా లాంటి దేశాల్లో ఉన్న ముస్లింలతో పోలిస్తే, భారత్‌లో ముస్లింలు బెటర్‌గా ఉన్నట్లు చెప్పారు. అందుకే పొరుగు దేశాల్లో ఉంటున్న ముస్లింలు కూడా ఆశ్రయం కోరుతున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. ఇతర దేశాల్లో మైనార్టీలకు కల్పిస్తున్న ఓటింగ్ హక్కుల గురించి కూడా మంత్రి రిజిజు తెలిపారు. దేశం గురించి మాట్లాడే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారత ఇమేజ్‌పై ప్రభావం పడే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. తమ హక్కులను కాపాడుకునేందుకు మైనార్టీలకు న్యాయరక్షణ కల్పిస్తోందని మంత్రి రిజిజు తెలిపారు. ప్రజాస్వామ్య రంగంలో భారత్‌తో ఏ దేశాన్ని కూడా పోల్చలేమన్నారు. దేశ ఆర్థిక ప్రగతిలో చాలా గ్యాప్‌లు ఉన్నాయని, అందుకే ప్రధాని మోదీ వికసిత్ భారత్ నినాదాన్ని ఇచ్చినట్లు వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని ఏళ్లు గడుస్తున్నా.. భారత్‌ను అభివృద్ధి దేశంగా ఎందుకు మార్చలేకపోయారని అడిగారు.

నేరాలకూ రాజధానిగా ఢిల్లీ

అమిత్ షాకు కేజ్రీవాల్ లేఖ

డ్రగ్స్ నేరాలు 350 శాతం పెరిగాయని ఆందోళన

హైదరాబాద్, డిసెంబర్ 14(ఆర్ఎన్ఎ): ఢిల్లీలో పెరుగుతున్న నేరాలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. ఢిల్లీ నేరాలకు కూడా రాజధానిగా మారిందని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో డ్రగ్స్ నేరాలు 350 శాతం పెరిగాయన్నారు. మహిళలపై నేరాలు, హత్యల్లో ఢిల్లీదే మొదటి స్థానమన్నారు. ఢిల్లీలో బాంబు బెదిరింపులు నిత్యకృత్యంగా మారాయన్నారు. బాంబు బెదిరింపుల కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ శాంతిభద్రతలపై తక్షణమే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. శాంతిభద్రతల సమస్యను వివరించేందుకు తనకు అపాయింట్ మెంట్ ఇవ్వాలని కోరారు. భారత్‌లోని మెట్రో నగరాలతో పోలిస్తే ఢిల్లీలోనే అత్యధికంగా నేరాలు జరుగుతున్నాయని విమర్శించారు. నేరాల కారణంగా ఢిల్లీకి 'రేప్ క్యాపిటల్', 'క్రైమ్ క్యాపిటల్' అనే కొత్త పేర్లు వస్తున్నాయన్నారు.

రాజ్యసభ సభ్యురాలిగా రేఖా శర్మ ఏకగ్రీవం

చండీగఢ్, డిసెంబర్ 14: రాజ్యసభ ఉప ఎన్నికల్లో జాతీయ మహిళా కమిషన్ మాజీ అధ్యక్షురాలు, భాజపా నాయకురాలు రేఖా శర్మ హరియాణా నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమెకు పోటీగా ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. శుక్రవారం 3 గంటలతో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియగా బరిలో ఆమె ఒక్కరే నిలిచారు. దీంతో ఆమె ఎన్నిక లాంఛనమైంది. భాజపాకు చెందిన కృష్ణ్ లాల్ పన్వార్ శాసనసభ ఎన్నికల్లో గెలవడంతో తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో ఖాళీ అయిన ఆ స్థానానికి తాజాగా రేఖా శర్మ ఎన్నికయ్యారు.

ఈడీ అధికారులపై క్యాసినో నిర్వాహకుల దాడి

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: దేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులపై జరుగుతున్న వరుస దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ఓ కేసు నేపథ్యంలో క్యాసినో నౌకలో సోదాలకు వెళ్లిన ఈడీ అధికారులపై దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గోవాలోని ఆఫ్‌షోర్ క్రూయిస్ ప్రైడ్ క్యాసినో నౌకలో సోదాలకు వెళ్లిన ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ పోలూరి చెన్నకేశవరావు, ఇద్దరు సిబ్బందిపై క్యాసినో డైరెక్టర్, అతడి అనుచరులు దాడికి పాల్పడినట్లుగా గోవా పోలీసులు వెల్లడించారు. మనీలాండరింగ్ కేసుకు సంబంధించి తాము స్వాధీనం చేసుకున్న ఆధారాలను సైతం ధ్వంసం చేశారని అధికారులు ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని నిందితులు బెదిరించారన్నారు. గత నెలలో దిల్లీలోని బిజ్వాసన్ ప్రాంతంలో ఓ సైబర్ మోసం కేసును ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్న సమయంలో పలువురు దుండగులు వారిపై దాడులకు పాల్పడ్డారు. జనవరిలోనూ పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో కేసు దర్యాప్తుకు వెళ్లిన అధికారులపై అక్కడి వారు దాడి చేయడంతో ముగ్గురు అధికారులు గాయపడ్డారు.

నువ్వు నాలో స్ఫూర్తిని నింపావు
రానాకు సమంత బర్త్‌డే విషెస్



రానా దగ్గుబాటి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఆయనకు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇదే సమయంలో సినీ సెలబ్రిటీలు సైతం రానాకు విషెస్ తెలుపుతున్నారు. ఈ క్రమంలో స్టార్ నటి సమంత సైతం రానాకు ప్రత్యేకంగా బర్త్‌డే విషెస్ తెలియజేశారు. 'హ్యాపీ బర్త్ డే రానా. నువ్వు చేసే ప్రతి పనిలోనూ వంద శాతం ఫోకస్ పెడుతుంటావు. ఈ విషయంలో నీ నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందాను. నేను ఎప్పటికీ నీ అభిమానినే. దేవుడు ఆశీర్వాదులు నీకు ఎప్పుడూ ఉండాలి' అంటూ ఇన్‌స్టా వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. కాగా, రానా ప్రస్తుతం సరికొత్త టాక్ షోతో ప్రేక్షకులను అలరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 'నం1 యారి' అంటూ ఓటీటీలో సందడి చేసిన రానా.. ఇప్పుడు 'ది రానా దగ్గుబాటి షో' అనే పేరుతో అభిమానులను అలరిస్తున్నాడు. ఈ షో ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో నవంబర్ 23 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.

ఆమె లోటు ఎవరూ పూడ్చలేనిది
జైలు నుంచి విడుదల అనంతరం మీడియాతో అల్లుఅర్జున్

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. శుక్రవారం అరెస్ట్ అవ్వడంతో చంచల్‌గుడా జైలుకు తరలించగా.. హైకోర్ట్ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. దీంతో శనివారం ఉదయం జైలు నుంచి విడుదలై ఇంటికి వచ్చారు. అయితే ఉదయమే మీడియాతో మాట్లాడిన అల్లు అర్జున్ తాజాగా మరోసారి మీడియా ముందుకు వచ్చాడు. ఈ సందర్భంగా తనకు అండగా నిలిచిన అభిమానులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన దురదృష్టకరం. బాధిత కుటుంబానికి జరిగిన నష్టం పూడ్చలేనిది. ఆ కుటుంబానికి మరోసారి నా క్షమాపణలతో పాటు సానుభూతి తెలుపుతున్నా. బాధిత కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటాను. నేను సినిమా చూసేందుకు వెళ్లినప్పుడు అనుకోకుండా ఈ ఘటన జరిగింది. ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదు. గత 20 ఏళ్లుగా థియేటర్‌కు వెళ్లి సినిమా చూస్తున్నా.. కానీ ఎప్పుడూ ఇలా జరగలేదు. నాకు అండగా నిలిచిన అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు అంటూ అల్లు అర్జున్ చెప్పుకోచ్చాడు.

అర్జున్‌ను చూసి ఎమోషనల్ అయిన చిరంజీవి భార్య

సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో అరెస్టైన టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ చంచల్‌గూడ జైలు నుంచి శనివారం ఉదయం 6.40 గంటలకు విడుదలయిన విషయం తెలిసిందే. జైలు నుంచి ఆయన జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బన్నిని పరామర్శించేందుకు సినీ సెలబ్రిటీలు అల్లు నివాసానికి చేరుకుంటున్నారు. ఈ క్రమంలోనే అక్కడకి చేరుకున్న అల్లు అర్జున్ మేనత్త, చిరంజీవి భార్య సురేఖ అల్లు అర్జున్‌ను చూసి భావోద్వేగానికి గురైంది. అల్లు అర్జున్ కూడా మేనత్తని చూసి దగ్గరికి వెళ్లి హగ్ చేసుకున్నాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

అల్లుఅర్జున్ అరెస్టుపై ప్రముఖ నటుల కామెంట్లు

ఇదొక దురదృష్టకర ఘటన. దీని నుంచి మనం ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి. ఇకపై మరిన్ని జాగ్రత్తలు పాటించి భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఇక్కడ మనందరి తప్పు ఉంది. ఒక వ్యక్తిని నిందించడం కరెక్ట్ కాదు. - నాని

నమ్మలేక పోతున్నా
ప్రస్తుతం జరుగుతున్నది నమ్మలేక పోతున్నా. జరిగిన సంఘటన దురదృష్టకరం, చాలా బాధాకరం. అయితే, తప్పంతా ఒక వ్యక్తిపైకి నెట్టడం సమంజసం కాదు. - రష్మిక

బాధాకరం
సంధ్యా థియేటర్ వద్ద జరిగిన ఘటన బాధాకరం. మరిన్ని జాగ్రతలు తీసుకుని ఉండాల్సింది. ఈ ఘటనకు అల్లు అర్జున్‌ని బాధ్యుడిగా చేయడం దారుణం. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి. - అనిల్ రావిపూడి

దురదృష్టకరం
థియేటర్ వద్ద ఘటన దురదృష్టకరం. ఒక తల్లి ఆ రోజు ప్రాణాలు కోల్పోయింది. కానీ ఈ రోజు అల్లు అర్జున్ పట్ల జరిగింది మాత్రం చాలా కఠినమైన చర్య. - అడవి శేష్

మీడియా తప్పు లేదు

మంచు ఫ్యామిలీలో జరుగుతున్న గొడవల నేపథ్యంలో సినీ నటుడు మంచు మోహన్ బాబు జర్నలిస్ట్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడి ఘటనలో జర్నలిస్ట్‌కు తీవ్రగాయాలు కాగా.. మోహన్ బాబు క్షమాపణలు చెప్పాలి అంటూ జర్నలిస్ట్ సంఘాలు అన్నీ ధర్నా చేయడం మొదలు పెట్టాయి. ఇప్పటికే ఈ ఘటనకు సంబంధించి మోహన్ బాబు క్షమాపణలు తెలుపగా.. తాజాగా ఈ విషయంపై నటుడు మంచు మనోజ్ స్పందించాడు. ఈ ఘటనలో మీడియా తప్పు లేదు. నిస్సహాయ స్థితిలో నేను మీడియాను లోపలికి తీసుకువెళ్లాను. మా ఇంట్లోకి నన్ను అనుమతించకపోవడంతోనే మీడియా ప్రతినిధులను వెంటబెట్టుకుని తీసుకువెళ్లా. లోపలికి వెళ్లిన అనంతరం తనపై దాడి జరిగింది. ఈ ఘటనలో అసలు మీడియా తప్పు లేదు అంటూ మనోజ్ చెప్పుకోచ్చాడు.

ఖైదీ నెంబర్ 7697
జైలులో బన్నీ ఏం చేశాడంటే..?

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. శుక్రవారం అరెస్ట్ అవ్వడంతో చంచల్‌గుడా జైలుకు తరలించగా.. హైకోర్ట్ మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. అల్లు అర్జున్‌ని చంచల్‌గుడాలోని వీఐపీ బ్లాక్ ఉంచినట్లు తెలుస్తుంది. ఇక జైలులో ఉన్న అల్లు అర్జున్‌కు అండర్ ట్రయల్ ఖైదీగా యూటీ 7697 నంబర్‌ను అధికారులు కేటాయించారు. రాత్రంతా మంజీరా బ్యారక్‌లోని బ్లాక్ - 1లో అల్లు అర్జున్‌ని ఉంచగా.. తెల్లవారేవరకు అల్లు అర్జున్ నిద్రపోకుండానే గడిపినట్లు తెలుస్తుంది. అల్లు అర్జున్ పడుకునే ముందు జైలు సిబ్బంది రగ్గు దుప్పటి ఇచ్చినట్లు సమాచారం. అయితే వీటిని తిరస్కరించి అల్లు అర్జున్ నేలపైనే పడుకున్నట్లు.. ఇక జైలులో ఉన్నంత సేపు అధికారులతో తప్ప ఎవరితో బన్నీ మాట్లాడలేదని తెలుస్తుంది. రాత్రి జైలులో అధికారులు భోజనం అందించగా.. కొంచెం తిని పక్కన పెట్టినట్లు తెలుస్తుంది. ఉదయం 5.45 గంటలకు బన్నీని జైలు నుంచి బయటకు తీసుకువచ్చి.. విడుదలకు సంబంధించి ఫార్మాలిటీస్ పూర్తిచేసినట్లు.. ఉదయం 6.39 గంటలకు విడుదల చేసినట్లు సమచారం.

ఇది ముమ్మాటికీ రాజకీయమే

చిక్కడ పల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం.. నాంపల్లి కోర్టు రిమాండ్ విధించడం.. హైకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేయడం.. రాత్రంతా బన్నీ జైల్లోనే ఉండటం అందరికీ తెలిసిందే. శనివారం ఉదయమే బన్నీని జైలు నుంచి విడుదల చేశారు. ఇక సెలెబ్రిటీలు అయితే బన్నీకి అండగా నిలిచారు. టాలీవుడ్ మొత్తం కదిలివచ్చింది. అల్లు అర్జున్ కోసం బాలీవుడ్ స్టార్లు కూడా మాట్లాడి మద్దతు తెలిపారు. ఇక సోషల్ మీడియాలో బన్నీ అరెస్ట్ మీద భిన్న వాదనలు అయితే వినిపించాయి. స్టార్ అయితే ఏంటి? నేషనల్ అవార్డు విన్నర్ అయితే ఏంటి? చట్టం ముందు అందరూ సమానులే.. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది అని కొందరు అన్నారు. ఇక రేవంత్ రెడ్డి కక్ష్య సాధింపు చర్యలు అంటూ ప్రతి పక్షాలు మండిపడ్డాయి. ఈ హడావిడిలో పూనమ్ కౌర్ కూడా కొన్ని సెటైర్లు వేసింది. అల్లు అర్జున్ ఫోటోలను షేర్ చేస్తూ.. నా ఫేవరేట్ హీరో అని చెప్పింది. ఇక తాజాగా మరో ట్వీట్ వేసింది. ఇందులో అధికారాన్ని దుర్వినియోగం చేయడమే రాజకీయం.. ఆ అధికారాన్ని ప్రజల అభివృద్ధికి వాడటమే నాయకత్వం అంటూ కౌంటర్ వేసింది. అంటే రేవంత్ రెడ్డి తన పవర్‌ను మిస్ యూజ్ చేస్తున్నాడని, రాజకీయాలు చేస్తున్నాడని పూనమ్ కౌర్ చెప్పకనే చెబుతూ కౌంటర్లు వేసింది. అల్లు అర్జున్ మాత్రం బయటకు వచ్చి మీడియాతో మాట్లాడుతూ.. చట్టపరిధిలో ఈ కేసు ఉందని, భారత న్యాయ వ్యవస్థ మీద తనకు పూర్తి నమ్మకం ఉందని, ఈ కేసు గురించి తాను బయట మాట్లాడను అని చెప్పేసి వెళ్లిపోయాడు. మరి నెక్స్ట్ బన్నీ ఎలాంటి స్టెప్ తీసుకుంటాడో చూడాలి. నాలుగు వారాల అనంతరం ఈ కేసులో ఏ ట్విస్టులు చోటు చేసుకుంటాయో చూడాలి.

మూడో టెస్టుకు వర్షం అంతరాయం

తొలి రోజు ఆట రద్దు..

ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న మూడో టెస్టుకు వర్షం అంతరాయం కలిగించింది. బ్రిస్బేన్‌లోని గబ్బా స్టేడియం వేదికగా శనివారం ప్రారంభమైన ఈ మ్యాచ్ తొలి రోజు ఆటను అంపైర్లు రద్దు చేశారు. ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.వర్షంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి ఆస్ట్రేలియా 13.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది. ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజా(19 బ్యాటింగ్), నాథన్ మెక్‌స్వీనీ(4 బ్యాటింగ్) అచితూచి ఆడారు. జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ఆకాశ్ దీప్ బంతులను చాకచక్యంగా ఎదుర్కొన్నారు. రెండో రోజు ఆట భారత కాలమాన ప్రకారం ఆదివారం ఉదయం 5.20 గంటలకు ప్రారంభం కానుంది. ఆట సజావుగా సాగితే 98 ఓవర్లు ఆడించనున్నారు. అయితే రెండో రోజు కూడా వర్షం ముప్పు పొంచి ఉంది. దాంతో అభిమానులను ఆందోళనకు గురవుతున్నారు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన టీమిండియా బౌలింగ్ ఎంచుకుంది. 5.3 ఓవర్ల పాటు ఆట జరగ్గానే వర్షం రావడంతో అంపైర్లు, ఆటగాళ్లు స్టేడియం నుంచి బయటకు పరుగెత్తారు. వర్షం తగ్గడంతో తిరిగి ఆట ప్రారంభమైంది. కానీ మరో 7.5 ఓవర్ల పాటు ఆట జరగ్గా వర్షం మరోసారి అంతరాయం కలిగించడంతో అంపైర్లు ముందుగానే లంచ్ బ్రేక్ ప్రకటించారు. ఆ తర్వాత వర్షం ఎంతకీ తగ్గకపోవడంతో తొలి రోజు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక ఓవర్‌కాస్ట్ కండీషన్స్ నేపథ్యంలోనే బౌలింగ్ ఎంచుకున్నానని టాస్ సందర్భంగా టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. కొంచెం ఓవర్‌కాస్ట్ కండిషన్స్ ఉండటంతో పాటు పిచ్‌పై గ్రాస్ కూడా ఉంది. ఈ కండిషన్స్‌ను ఉపయోగించుకోవాలనుకుంటున్నాం. ఇప్పటికే మేం చాలా క్రికెట్ ఆడాం. గత రెండు మ్యాచ్‌ల్లో ఇరు జట్లు మెరుగైన ప్రదర్శన చేశాయి. ఈ మ్యాచ్ మాకు చాలా కీలకం. మాపై ఉన్న అంచనాలను అందుకోవాలనుకుంటున్నాం. మంచి క్రికెట్ ఆడుతాం. విజయవకాశాలను అందిపుచ్చుకోవాలి. గత మ్యాచ్‌లో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయాం. అందుకే ఓటమిపాలయ్యాం. ఈ మ్యాచ్ కోసం కుర్రాళ్లంతా సిద్దంగా ఉన్నారు. ఎప్పుడెప్పుడు ఆడుదామా? అనే ఉత్సాహంతో ఉన్నారు. మ్యాచ్ సాగుతున్నా కొద్దీ ఈ వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తోంది. తుది జట్టులో మేం రెండు మార్పులు చేశాం. అశ్విన్, హర్షిత్ రాణా స్థానాల్లో రవీంద్ర జడేజా, ఆకాశ్ దీప్ జట్టులోకి వచ్చారు. టీమ్ కాంబినేషన్‌లో భాగంగానే ఈ మార్పులు చేశాం.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

టాస్ సమయంలో భారత్‌కు 'చెడు శకునం'

బ్రిస్బేన్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్టు జరుగుతోంది. రెండు జట్లూ ఒక్కో మ్యాచ్ గెలిచి సిరీస్‌లో సమంగా ఉన్నాయి. ఇప్పుడు ఈ మ్యాచ్‌లో విజయాన్ని నమోదు చేసి ముందంజ వేయాలనే ఉద్దేశ్యంతో బరిలోకి దిగారు. అయితే,

తొలిరోజు ఆటలో టాస్ సమయంలో భారత్‌కు 'చెడు శకునం' ఎదురైంది. ఇది నిజమని నిరూపితమైతే.. టీమిండియా ఈ మ్యాచ్‌లో ఓడిపోక తప్పదు. వాస్తవానికి, ఆస్ట్రేలియాలో ఇప్పటి వరకు, టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ చేసిన తర్వాత భారత జట్టు ఎప్పుడూ మ్యాచ్‌ను గెలవలేకపోయింది. అయితే, బ్రిస్బేన్‌లో టాస్ గెలిచిన తర్వాత రోహిత్ శర్మ బౌలింగ్ ఎంచుకున్నాడు. ఆస్ట్రేలియాలో టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్న భారత్ రికార్డును చూస్తుంటే.. రోహిత్ శర్మ తప్పుచేసినట్లు కనిపిస్తోంది. అతని కంటే ముందు 21 ఏళ్ల క్రితం 2003లో భారత కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఈ తప్పు చేశాడు. ఆ సమయంలో కూడా టీం ఇండియా ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఆస్ట్రేలియాలో టాస్ గెలిచిన తర్వాత, భారత్ 8 సార్లు మొదట బౌలింగ్ చేయాలని నిర్ణయించుకుంది. ఈ సమయంలో, భారత్ 4 మ్యాచ్‌లలో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. 4 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. ఇది కాకుండా టాస్ నుంచి భారత్ షాకిచ్చే మరో విషయం ఆస్ట్రేలియా రికార్డు. నివేదిక ప్రకారం, 1985 నుంచి ప్రత్యర్థి జట్లు కంగారూ జట్టును గబ్బాలో మొదట బ్యాటింగ్ చేయమని కోరింది. ఈ సమయంలో ఎప్పుడూ ఆస్ట్రేలియా ఓడిపోలేదు. ఈ రెండు గణాంకాలు చూస్తుంటే టాస్ సమయంలో భారత జట్టుకు చెడు శకునమే ఎదురైందని చెప్పవచ్చు. 2000 సంవత్సరం తర్వాత గబ్బా మైదానంలో 24 మ్యాచ్‌లు జరిగాయి.

షమీ వెనకడుగు

భారత స్టార్ పేసర్ మహ్మద్ షమీ ప్రస్తుతం తన భవిష్యత్ ప్రాధాన్యతలను నిశ్చయించుకునే దశలో ఉన్నారు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి తిరిగి చేరే బదులు, ఐపీఎల్ 2025 సీజన్‌కు సిద్ధమవడానికి ఆయన ప్రాధాన్యత ఇవ్వవచ్చని తాజా నివేదికలు సూచిస్తున్నాయి. ఇది షమీ తన శారీరక ఫిట్‌నెస్‌ను, తన కెరీర్ ముగింపు దశకు చేరుకుంటున్న దశలో పునరాలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అతను తన శక్తిని పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లకు కేంద్రీకరించాలనుకుంటున్నాడని సమాచారం. ముఖ్యంగా, గత ఐపీఎల్ సీజన్‌ను శస్త్రచికిత్స కారణంగా కోల్పోయిన షమీ, ఈసారి పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండటానికి కృషి చేస్తున్నాడు. షమీ మరింత దేశీయ క్రికెట్ ఆడటంపై దృష్టి పెట్టవచ్చని, అతను త్వరలో విజయ్ హజారే ట్రోఫీలో బెంగాల్ తరఫున కనిపించే అవకాశం ఉందని తెలిపాయి. షమీ బౌలింగ్ శక్తిని దృష్టిలో ఉంచుకుంటే, అతను ప్రస్తుతం మ్యాచ్‌కు 10 ఓవర్లు బౌలింగ్ చేయగల ఫిట్‌నెస్‌ను కలిగి ఉన్నాడని వర్గాలు పేర్కొన్నాయి. అయితే, రెడ్ బాల్ క్రికెట్‌లో తనకు తగిన ప్రేరణ లేకపోవడంతో, అతను ప్రాధాన్యతను వైట్ బాల్ ఫార్మాట్‌లకు మార్చే ఉద్దేశ్యంలో ఉన్నట్లు కనిపిస్తోంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో, షమీ తన ఫామ్‌ను ప్రదర్శించాడు. తొమ్మిది మ్యాచ్‌లలో 7.85 ఎకానమీ రేటుతో 11 వికెట్లు తీశాడు. అంతేకాదు, చండీగఢ్‌పై ప్రీ-క్వార్టర్ ఫైనల్ విజయంలో తన ఆల్‌రౌండ్ నైపుణ్యాన్ని ప్రదర్శించి, 17 బంతుల్లో అజేయంగా 32 పరుగులు చేశాడు. భారత పేస్ విభాగం ఇప్పుడు జస్ప్రీత్ బుమ్రా

టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకో..

బుమ్రాకు షోయబ్ అక్తర్ సలహా

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు పాకిస్థాన్ మాజీ పేసర్, రావల్పిండి ఎక్స్‌ప్రెస్ షోయబ్ అక్తర్ విచిత్రకరమైన సలహా ఇచ్చాడు. టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకోవాలని భారత స్టార్ పేసర్‌కు సూచించాడు. బుమ్రా టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకోని వైట్‌బాల్ క్రికెట్‌పై ఫోకస్ పెట్టాలన్నాడు. టెస్ట్ క్రికెట్‌లో కొనసాగితే బుమ్రా కెరీర్ దెబ్బతింటుందని హెచ్చరించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో కొనసాగే సామర్థ్యం బుమ్రాకు లేదన్నాడు. టెస్ట్ క్రికెట్‌లో బుమ్రా కొనసాగాలనుకుంటే బౌలింగ్ వేగం పెంచాలని, ఎక్స్‌ట్రా పేస్ కోసం ప్రయత్నిస్తే గాయపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అభిప్రాయపడ్డాడు. ఓ పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో అక్తర్.. బుమ్రా బౌలింగ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. 'వన్డే, టీ20ల్లో బుమ్రా అద్భుతమైన ఫాస్ట్ బౌలర్. ఎందుకంటే అతను లెంగ్త్‌ను బాగా అర్థం చేసుకుంటాడు. బంతిని రెండు వైపులా స్వింగ్ చేస్తూ పవర్ ప్లేలో.. డెత్ ఓవర్లలో అద్భుత ప్రదర్శన కనబర్చాడు. కానీ టెస్ట్ క్రికెట్‌లో మాత్రం సుదీర్ఘమైన స్పెల్స్ వేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా బ్యాటర్లు డిఫెన్స్‌కు ప్రయత్నిస్తారు కాబట్టి ఎక్స్‌ట్రా పేస్‌తో బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. లెంగ్త్‌తో పెద్దగా అవసరం ఉండదు. బౌలింగ్‌లో పేస్ లేకుంటే బంతి సీమ్, రివర్స్ స్వింగ్ కాదు. బౌలింగ్‌లో తడబడుతుంటే జనాలు ప్రశ్నించడం మొదలుపెడుతారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బుమ్రా టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకోవడమే ఉత్తమం. ఇప్పటికే టెస్ట్ క్రికెట్‌లో అతను చాలా వికెట్లు తీసాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో బుమ్రా దారుణంగా విఫలమయ్యాడు. ఒకవేళ బుమ్రా టెస్ట్ క్రికెట్‌లో కొనసాగాలనుకుంటే బౌలింగ్‌లో వేగాన్ని పెంచాలి. పేస్‌ను పెంచితే గాయపడే ప్రమాదం పొంచి ఉంది. నేనే బుమ్రా ప్లేస్‌లో ఉంటే మాత్రం టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికి పరిమిత ఓవర్లపై ఫోకస్ పెట్టేవాడిని. నేను నా మనసు మాట వినేవాడిని. నేను బాగున్నానని భావిస్తేనే ఆడేవాడిని. బుమ్రా టెస్ట్ క్రికెట్ మాత్రమే ఆడితే సమస్య లేదు. కానీ అతను ఐపీఎల్‌తో పాటు వన్డేలు, టీ20లు, టెస్ట్ క్రికెట్ కూడా ఆడాలనుకుంటున్నాను. వరల్డ్ బెస్ట్ పేసర్ అయిన బుమ్రాను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉంది. గాయాల బారిన పడకుండా చూసుకోవాలి.'అని షోయబ్ అక్తర్ చెప్పుకొచ్చాడు. టెస్ట్ క్రికెట్‌లో బుమ్రా ఇప్పటికే 42 మ్యాచ్‌లు ఆడి 20.01 సగటుతో 185 వికెట్లు పడగొట్టాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 400 ప్లస్ వికెట్లు పడగొట్టాడు. బుమ్రా నిలకడగా గంటలకు 140 ప్లస్ కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేస్తాడు.

ఆకాశ్ దీప్‌ను చూసి నేర్చుకోండి

బుమ్రా, సిరాజ్‌కు పుజారా హితవు

ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్ట్‌లో భారత పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్‌లు మెరుగ్గా బౌలింగ్ చేయలేదని వెటరన్ బ్యాటర్ చతేశ్వర్ పుజారా అన్నాడు. తొలి 6 ఓవర్లలో ఆసీస్ బ్యాటర్లను ఈ ఇద్దరూ పేసర్లు ఇబ్బంది పెట్టలేకపోయారని విమర్శించాడు. ఈ ఇద్దరి కంటే యువ పేసర్ ఆకాశ్ దీప్ మెరుగ్గా బౌలింగ్ చేశాడని కొనియాడాడు. బ్రిస్బేన్‌లోని గబ్బా స్టేడియం వేదికగా శనివారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించడంతో తొలి రోజు 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. వర్షంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి ఆస్ట్రేలియా వికెట్ నష్టపోకుండా 28 పరుగులు చేసింది. ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజా(19 బ్యాటింగ్), నాథన్ మెక్‌స్వీనీ(4 బ్యాటింగ్) అచితూచి ఆడారు. ఈ 13.2 ఓవర్లను సిరాజ్, బుమ్రా, ఆకాశ్‌దీప్‌లే వేసారు. ఓవర్‌కాస్ట్ కండిషన్స్‌తో పాటు పిచ్‌పై గ్రాస్ ఉండటంతో వికెట్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉంటుందని టీమిండియా బౌలర్లు భావించారు. కానీ బుమ్రా, సిరాజ్ బంతులు ఏమాత్రం స్వింగ్ కాలేదు. బంతి స్వింగ్ అవ్వడం లేదని బుమ్రా చెప్పిన మాటలు స్టంప్ మైక్‌లో రికార్డ్ అయ్యాయి. అయితే బుమ్రా సిరాజ్‌లు సరైన లైన్ అండ్ లెంగ్త్‌లో బౌలింగ్ చేయలేదని ఈ మ్యాచ్‌కు కామెంటేటర్‌గా వ్యవహరిస్తున్న పుజారా అన్నాడు. బుమ్రా, సిరాజ్‌లు.. ఆకాశ్ దీప్‌ను చూసి నేర్చుకోవాలని సూచించాడు. ఆకాశ్ దీప్ సరైన లెంగ్త్‌లో బౌలింగ్ చేసి ఆసీస్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడని చెప్పాడు. బుమ్రా. సిరాజ్ మాత్రం ఎక్స్‌ట్రా ఫుల్ లెంగ్త్, షార్ట్ లెంగ్త్, లెగ్ స్టంప్ లైన్‌లో బౌలింగ్ చేశారని తెలిపాడు. ఆసీస్ పిచ్‌లపై 6 మీటర్ల పొడవున బౌలింగ్ చేయడం సరికాదన్నాడు. పెర్త్ టెస్ట్‌లో బుమ్రా, సిరాజ్ సరైన లెంగ్త్‌లో బౌలింగ్ చేసి వికెట్లు పడగొట్టారని గుర్తు చేశాడు. తొలి 6 ఓవర్లలో విఫలమైనా.. తర్వాత లయను అందుకున్నారని పుజారా చెప్పుకొచ్చాడు.

భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య మూడో టెస్టు బ్రిస్బేన్ వేదికగా ప్రారంభమైంది. ఈ టెస్టులో మైదానంలోకి దిగిన వెంటనే విరాట్ కోహ్లీ సెంచరీ పూర్తి చేశాడు. విరాట్ కోహ్లీ చేసిన ఈ సెంచరీ పరుగులతో కాదండోయ్.. అతను ఆడిన మ్యాచ్‌లది. బ్రిస్బేన్‌లో విరాట్ కోహ్లీ చేసిన ఈ అపూర్వ సెంచరీ కారణంగా సచిన్ టెండూల్కర్ రికార్డు కూడా ప్రమాదంలో పడినట్లే. నిజానికి ఒకే ప్రత్యర్థిపై అత్యధిక మ్యాచ్‌లు ఆడిన రికార్డు మాస్టర్ బ్లాస్టర్ టెండూల్కర్ పేరిట ఉంది.ఆస్ట్రేలియాపై మాత్రమే అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా సచిన్ టెండూల్కర్ రికార్డు సృష్టించాడు. అతను ఈ జట్టుపై 110 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. అదే సంఖ్యలో మ్యాచ్‌లు ఆడుతున్న ఈ రికార్డు శ్రీలంకకు చెందిన మహేల జయవర్ధనే పేరిట ఉంది. అయితే, జయవర్ధనే భారత్‌పై 110 మ్యాచ్‌లు ఆడాడు. ఒక ప్రత్యర్థిపై అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో సచిన్ పేరు కూడా రెండో స్థానంలో ఉంది. శ్రీలంకతో 109 మ్యాచ్‌లు ఆడి ఈ ఘనత సాధించాడు. ఆ తర్వాత, పాకిస్థాన్‌తో 105 మ్యాచ్‌లు, భారత్‌తో 103 మ్యాచ్‌లు ఆడిన సనత్ జయసూర్య పేరు జాబితాలో రెండుసార్లు కనిపిస్తుంది. 103 మ్యాచ్‌లు ఆడిన రికార్డు మరోసారి జయవర్ధనే పేరిట ఉంది. పాకిస్థాన్‌పై ఈ ఘనత సాధించాడు. అయితే, వీటన్నింటి కంటే ఇప్పుడు విరాట్ కోహ్లీ ముందుకు వెళ్లే అవకాశం ఉంది. దీంతో ప్రపంచంలో ఒకే ప్రత్యర్థితో అత్యధిక క్రికెట్ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా అవతరించనున్నాడు.

పంచ వాయువులు

పంచభూతాల రజోగుణాన్ని నాలుగు భాగాలుగా చేసి అందులోని మూడు భాగాల నుంచి ప్రాణాన్ని సృష్టించారు. ప్రాణాలు ఐదు రకాలు. అవి 1. ప్రాణ 2. అపాన 3. వ్యాన 4. ఉదాన 5. సమాన వాయువులు.

1. ప్రాణవాయువు: ఇది హృదయం నందు ఉంటుంది. దీనికి అధిష్ఠాన దేవత 'విశిష్ఠకుడు', ఇది శ్వాసాదులను ఇడపింగళనాడుల గుండా బయటకు పంపుతుంది.

2. అపాన వాయువు: ఇది గుదస్థానంలో ఉంటుంది. దీనికి అధిష్ఠానదేవత విశ్వకర్త. ఇది అధోముఖంగా సంచరిస్తూ శుక్లము, మలము, మూత్రము, రక్తములను కుహూనాడి, సినీవాలి నాడుల ద్వారా బయటకు పంపుతుంది. దీనిచే మలమూత్రాలు అధోముఖంగా విసర్జించబడతాయి.

3. వ్యానవాయువు: ఇది నాభిస్థానంలో ఉంటుంది. దీనికి అధిష్ఠానదేవత 'విశ్వయోని'. ఇది బయటి శీతోష్ణాలను లోపలకు, లోపలి శీతోష్ణాలను బయటకు పంపుతూ ఉంటుంది. భుజించిన ఆహారాన్ని శరీరమంతా వ్యాపింపచేస్తుంది.

4. ఉదాన వాయువు: ఇది కంఠస్థానంలో ఉంటుంది. దీనికి అధిష్ఠాన దేవత 'అజుడు' ఇది మనసు సంకల్ప, వికల్పాలను మాటల రూపంలో వెల్లడిస్తుంది. సుషుప్తావస్థలో ఇంద్రియాలను స్వాధీనం చేసుకుని తనకు కారణమైన అజ్ఞానంలో మునిగిపోతుంది. జాగ్రదావస్థలో ఇంద్రియాలను వాటి వాటి స్థానాలలో నిలబెడుతుంది. ఈ వాయువు సుషుమ్నగుండా సహస్రారందాకా సంచరిస్తుంది.

5. సమాన వాయువు: ఇది శరీరంలోని అన్ని అంగాలయందు సమానంగా వ్యాపించి ఉంటుంది. దీనికి అధిష్ఠాన దేవత 'జయుడు'. ఇది జఠరాగ్నిని ప్రజ్వలింపచేసి తిన్న ఆహారాన్ని అరిగిస్తుంది. శరీరంలోని 72 వేల నాడులకు సమానంగా అందిస్తుంది.

ఉపవాయువులు కూడా ఐదు ఉన్నాయి. వీటిలో 1. నాగవాయువు వాంతిని కలిగిస్తుంది. 2. కూర్మవాయువు కనురెప్పలను కదిలిస్తుంది. 3. కృకరవాయువు తుమ్ములను కలిగిస్తుంది. 4. దేవదత్త వాయువు ఆవులింతలు కలిగిస్తుంది. 5. ధనుంజయ వాయువు శరీరమంతా వ్యాపించి శరీరాభివృద్ధిని కలిగిస్తుంది.

- శ్యామల

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా..
సంస్కృతిని కాపాడే లక్ష్యంగా..
మన ఔన్నత్యాన్ని పెంచేలా..
మన ఔచిత్యాన్ని చాటేలా..
తెలుగు చరిత్రలోనే తొలిసారి..
ధర్మం కోసం అక్షర తపస్సు చేస్తూ..
తెలుగు ప్రజల కోసం వస్తున్నది..

"ఋషి తెలుగు దినపత్రిక"

'కురుక్షేత్రం' అన్న పేరుతో..
సంపాదకీయాన్ని తీసుకొస్తున్నది
ఆసక్తి కలిగిన రచయితలు..
ధర్మ పరిరక్షకులు..
ఈ అక్షర యజ్ఞంలో
పాలుపంచుకోవాలని విజ్ఞప్తి.
కురుక్షేత్రం పేజీ కోసం తమ
వ్యాసాలు పంపి
మరింత మందికి జ్ఞానాన్ని
ప్రసాదించాలని వినతి.

కాపాడుకుందాం
మన దేశాన్ని!
మన ధర్మాన్ని!!

రాముడికి సీత ఏమవుతుంది?

రామాయణానికి సంబంధించి చాలా పాపులర్ అయిన సామెత ఇది.. 'వెనుకటికి ఎవరో రామాయణం అంతా విన్నాక రాముడికి సీత ఏమవుతుందని అడిగాడట'.. ఇదీ ఆ సామెత. అలాంటి ప్రశ్నలు వేసేవాడు వెర్రివాడని కన్ఫర్మ్ చేసే భావనలో ఈ సామెత జనం నోళ్లలో నానుతూ ఉంటుంది. ఎప్పుడో మూడున్నర దశాబ్దాల క్రితం మహాకవి ఆరుద్ర ఈ ప్రశ్న వేశాడు..? రాముడికి సీత ఏమవుతుందని? ఎందుకు ఈ ప్రశ్న ఉదయించింది? నిజంగా ఇది జవాబు చెప్పాల్సిన ప్రశ్నేనా..? నిన్నటి తరానికి, ఇవాల్టి తరానికి రేపటి తరానికి కూడా నిద్రలో లేపి అడిగినా ఠక్కున జవాబు చెప్పే జగమెరిగిన సత్యాన్ని ప్రశ్నించటం ఏమిటి?

కోవెల సంతోష్ కుమార్
ప్రముఖ సీనియర్ జర్నలిస్టు

ప్రపంచంలో మరే జాతికీ లేని విధంగా మన మూలాలను మనం ప్రశ్నించుకోవటం అనేది మనకు మాత్రమే చెల్లింది.. అందులో ఒకటే ఈ ప్రశ్న.. దీనికి జవాబు ఏమిటి? రామాయణం. రాముడు.. సీతారాములు.. వేల సంవత్సరాల నాటి చరిత్ర... అఖండ భారత మంతటితో అనుబంధం పెనవేసుకున్న చరిత్ర. ఆదికవి వాల్మీకికి నారదుడు విశదీకరించి చెప్పిన కథ.. మానవజాతి చరిత్రలోని మాననీయ అంశాలను జాతికి అందించిన మహా ఇతిహాసాలకు ఆది కావ్యమిది.. భూమికి భారంగా మారిన దుష్టశక్తులను నిర్మూలించేందుకు విష్ణువు శ్రీరామ చంద్రుడిగా, ఆది లక్ష్మి సీతాదేవిగా అవతరించిందని మనకు తెలుసు. అయోధ్య రాజు దశరథుడి కుమారుడిగా నారాయణుడు జన్మిస్తే, జనకుడి ఇంట సీతాదేవిగా లక్ష్మీదేవి అవతరించి, లోక కంటకాన్ని తొలగించారు. రామాయణం చెప్పని ఆదర్శం లేదు.. చూపించని ధర్మం లేదు.. నిరూపించని సత్యం లేదు. అలాంటి రామాయణంలో సీతారాముల బాంధవ్యాన్ని ప్రశ్నించటం అర్థంలేని ప్రశ్న.. చిన్నపిల్లవాణ్ణి అడిగినా సీత రాముడికి భార్య అవుతుందని చెప్తాడే తప్ప.. మరో మాట చెప్పడు.. సీతారాముల నింద ఈ దేశంలో భరించరానిది. రామ తిరస్కారం సహించరానిది. అలాంటి దేశంలో., 90 శాతం ప్రజానీకానికి వేల సంవత్సరాలుగా విశ్వాసప్రాతమైన రామాయణాన్ని ప్రశ్నించటం వెర్రితనమేనా? ఇప్పుడు ఎందుకు ఈ ప్రశ్న వచ్చింది? నిజానికి ఇదేం వెర్రి ప్రశ్నకాదు.. రాముడికి సీత ఏమవుతుందని అదగటానికి అనుమాన బీజం సహజంగానే పడుతోంది.. వాల్మీకి రామాయణం ప్రకారం ఆమె భూమి నుంచి పుట్టింది.. భూజాత.. నాగటి చాలుకు తగిలి జనకుడికి లభించింది కాబట్టి ఆమెను భూదేవి కూతురన్నారు. ఇక్కడే చిక్కుముడి అంతా ఉంది. విష్ణువు భార్యలు శ్రీదేవి.. భూదేవులని మనం చెప్పు కుంటాం.. విష్ణువు భార్య భూదేవి అయినప్పుడు.. ఆమె కూతురుగా పుట్టిన సీత... రాముడి రూపంలో అవతరించిన విష్ణువును ఎలా వివాహమాడిందన్నది లౌకికుల్లో ఉత్పన్నమయ్యే ప్రశ్న.. దీనికి జవాబు ఏమిటి?

ప్రజలకు తెలిసినంత వరకు రాముడికి సీత ఏమవుతుందన్న ప్రశ్నకు సంబంధించిన లాజిక్ ఇదొక్కటే. కానీ, ప్రపంచంలో ఇంతకంటే ఎక్కువ కథలు,, కథనాలు,, రామాయణాలు ఉన్నాయన్న విషయం చాలా మందికి తెలియదు, వాల్మీకి రామాయణాన్ని మించిన రామాయణాలు వేల కొద్దీ ఈ భూమ్మీద పుట్టాయి, చిత్రవిచిత్రమైన కథలు వెలువడ్డాయి.. రకరకాల సంబంధాలు.. వావి వరుసలు.. తమ తమ సమాజాలకు అనుకూలంగా, అనువుగా పుట్టుకొచ్చాయి.. ఇవన్నీ నిజమేనా? ఈ కథలన్నీ విశ్వసనీయమైనవేనా? రామాయణం రాసింది ఎవరు? వాల్మీకి.. భారతదేశపు ఆది కవి.. ఇది అందరికీ తెలిసిన నిజం. కానీ, రామాయణాలు ఎన్ని ఉన్నాయో తెలుసా? రాముడి చరిత్ర ఎన్ని చీలికలు పేలికలు అయిందో తెలుసా? లెక్కలేనన్ని.. వేల సంఖ్యలో రామాయణం రకరకాల కథలను పుట్టించింది. వాల్మీకి కాకుండా.. రామాయణాన్ని ఆయా కాలాల్లో.. చాలా మంది రచయితలు తమకు తోచిన రీతిలో.. తోచినట్లుగా రచించారు.. బౌద్ధమతానికి కూడా ఓ రామాయణం ఉంది.. జైన మతానికి ఓ రామాయణం ఉంది.. టిబెట్ నుంచి ఇండోనేషియా దాకా అన్ని మతాల్లో, అన్ని జాతుల్లో, అన్ని నాగరికతల్లో ఒక్కో రామాయణం పుట్టింది. స్త్రీల పాటల్లో ఒక రామాయణం., జానపద కథల్లో ఒక రామాయణం, నాటకాల్లో... రూపకాల్లో చెప్పుకుంటూ పోతే కోట్ల సంఖ్యలో రామాయణాలు పుట్టాయి.. అన్ని రామాయణాలకూ సీతారాములే ప్రధాన పాత్రధారులు.. రావణ సంహారమే అసలు కథ.

బౌద్ధ మతంలో పేరు తెలియని ఓ జాతక కథ రామాయణాన్నే చెప్తుంది. ఇందులో బోధిసత్వుడి భార్యను నాగుడనే వాడు ఎత్తుకుపోతే వానరుల సాయంతో అతణ్ణి సంహరించి భార్యను కాపాడుకోవటం కథ. ఇది అచ్చంగా రామాయణమే. మరో కథలో దశరథుడు అయోధ్యను కాకుండా వారణాసిని పరిపాలించాడట.. అతని పెద్ద కొడుకు పేరు రామపండితుడు.. రెండో కుమారుడు లక్ష్మణపండితుడు.. మూడో కుమార్తె సీత.. ఇందులో సీతారామలక్ష్మణులను సోదరులని చెప్పుకొచ్చారు.. ఇది పూర్తిగా రామాయణ పాత్రలతో, దాని కథను ఇమిటేట్ చేస్తూ రాసిన జాతక కథ. దీనికి ఎలాంటి హేతువు లేదు. చైనాలోని భోటాన్లో ప్రచారంలో ఉన్న మరో రామాయణం కూడా ఇదే విధంగా వుంటుంది. లావోస్‌లో రకరకాల రామకథలు ఉన్నాయి.. ఇందులో ఒకటి దశరథుడికి ముందోదరి వల్ల సీత పుట్టిందనేది.. పరమ విచిత్రమైన కథ ఇది.. మరో కథలో సీత రావణాసురుడి ఉద్యానవనంలో ఒక చెట్టుకు పుట్టిందని చెప్తారు.. థాయ్‌లాండ్లో మరో చిత్రమైన కథ ప్రచారంలో ఉంది... థాయిలాండ్‌కు సయాం అన్న పేరు కూడా ఉంది.. ఈ సయాంలో కూడా ఓ అయోధ్య నగరం ఉంది, రెండేళ్లు ముట్టడించినా శత్రు సైన్యాన్ని తట్టుకోగల దుర్గం ఇక్కడుంది.. క్రీస్తుశకం 1350 నుంచి 1417 దాకా 37 మంది రాజులు ఈ రాజ్యాన్ని పాలించారు. వీళ్లంతా రామభక్తులే.. వీళ్ల పేర్లన్నీ రాముడి పేరుతోనే ఉంటాయి., ఈ సయాంలో ప్రచారంలో ఉన్న రామాయణం ప్రకారం మండోదరి కడుపులో లక్ష్మీదేవి లంకలో జన్మించింది. పుడుతూనే రావణుని చంపు అని మాట్లాడటంతో ఆమెను పెట్టెలో పెట్టి నీళ్లలో పారేశాడు.. ఆమె మిథిలా నగరాధిపతికి దొరికింది.

మన దేశంలోనే ఆనంద రామాయణం మరో కథను చెప్తుంది. పద్మాక్షుడనే రాజు: మహాలక్ష్మిని కూతురుగా పొందాలని తపస్సు చేసి ఆమెను సాధించాడు. ఆమె స్వయంవర సమయంలో రావణుడు వచ్చి విధ్వంసం సృష్టించాడు. పద్మాక్షుడు మరణించాడు.. పద్మ అగ్నికుండంలో దూకింది.. ఆ తరువాత వేదవతిగా అవతరించింది.. ఆమెను చెరబట్టాలని చూసినప్పుడు ఆమె దహనమైపోయింది. ఆ బూడిదను రావణుడు లంకకు తీసుకుపోతే అక్కడ పాపగా అవతరించింది. ఆమెను పెట్టెలో ఉంచి సముద్రంలో పడవేశాడు.. ఆ పెట్టె జనకుడికి దొరికి ఆ పాప సీతగా పెరిగింది.. సీత పుట్టుక లంకకు చేటు అన్న సామెత ఈ కథ నుంచే పుట్టుకొచ్చింది. సీనియర్ ఎన్టీయార్ సీతారామకల్యాణం సినిమా ఈ కథను ఆధారం చేసుకునే రూపొందించారు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా చాలా రామాయణాలు ఉన్నాయి.. ఇవేవీ మూల రామాయణంతో సంబంధం ఉన్నవి కావు.. రామాయణ గాథను ఆధారం చేసుకుని ఆ పాత్రలను కథలో ఉపయోగించుకుని రకరకాల కాలాల్లో రాసిన కథలే. అసలైన మూల రామాయణానికి దీనికి ఎలాంటి సంబంధం లేదు.. కథలో.. కథనంలో పోలికలు తప్ప. ప్రధాన కథతో వీటికి ఎలాంటి లింక్స్ లేవు. తమ తమ ప్రాంతాల్లో ప్రచారాల్లో ఉన్న కథల్ని, అమలులో ఉన్న ఆచారాల్ని కలగలుపుకుని రాసిన కథలే ఇవన్నీ.. కాకపోతే,, వీటిని మూల రామాయణంతో పోల్చి, ఆ కథని, ఈ కథని కలగలిపి.. రామాయణాన్ని కలగాపులగం చేసి రామాయణం ఇతిహాసాన్ని గందరగోళంలో పడేసే యత్నం చేశారు.. దాని విశ్వసనీయతను నష్టపరిచే ప్రయత్నం చేశారు. కానీ, కొంచెం కూడా సడలించలేక పోయారు. రామాయణ సృష్టికర్త ఆదికవి వాల్మీకి, ఇందులో సందేహానికి తావు లేదు. వాల్మీకి రామాయణమే అసలైన రామకథ.. వాల్మీకి తరువాత ఎన్ని రామాయణాలు వచ్చినప్పటికీ అవన్నీ ఆయా రచయితలు అసలైన కథను బేస్ చేసుకుని కొత్తగా సృష్టించుకున్నవే తప్ప, మరేవీ కాదు, పాత్రల పేర్లు, ప్రచారంలో ఉన్న కథలు అన్నీ కూడా ఈ కల్పితాలకు మాత్రమే పరిమితమైనవి.. రాముడి కథకు, సీత చరిత్రకు ప్రామాణికం కేవలం వాల్మీకి రామాయణమే.. మరి సీత గురించి వాల్మీకి చెప్పింది ఏమిటి? వాల్మీకి రామాయణం ప్రామాణికంగా తీసుకోవటానికి కారణాలు చాలానే ఉన్నాయి. ఇందులో నిక్షిప్తమైన రామ కాల నిర్ణయం ఇందుకు మూలం,, భారతీయ నాగరికత ప్రాచీనతను ఇది నిరూపిస్తుంది.

ఇక సీత రాముడికి ఏమవుతుందన్న తొలి ప్రశ్న గురించి చర్చిద్దాం..

సీత భూమి నుంచి పుట్టింది.. కాబట్టి భూదేవి కుమార్తె..! ఈ వాదనే విద్దూరమైంది. ఆమె భూమిలో ఒక పేటికలో దొరికింది.. భూమిలో జన్మించలేదు.. ఇది స్పష్టం. రామావతార కార్యంలో ప్రధాన పాత్ర పోషించేందుకు భూమి ఒడిలోనుంచి జనకుడి ఇంట ప్రవేశించింది. ఆమె ఎవరి కూతురూ కాదు. ఆమె అయోనిజ. సామాన్య మానవిలా తల్లి గర్భం నుంచి పుట్టిన యువతి కాదు. ఆనంద రామాయణం ప్రకారం చూసినా అగ్ని నుంచి పుట్టిన వేదవతి బూడిదగా మారి లంకలో పాపాయిగా అవతరించి, అక్కడి నుంచి పేటికలో ప్రవేశించి సముద్ర మార్గంలో మిథిలకు చేరుకుంది. అక్కడ భూమిలో జనకుడికి దొరికింది. అందువల్ల ఆమె భూదేవి కూతురు కాదు.. ఆమె ఈ భూమ్మీద అవతరించటం కోసం భూదేవిని ఒక మార్గంగా ఉపయోగించుకుంది. కాబట్టి సీతారాముల సంబంధాన్ని ప్రశ్నించే అవసరమే ఉత్పన్నం కాదు. 'సీత అంటే నాగటి చాలు అని అర్థం. భూమి అధోజగత్తుకు ప్రతీక.. అంటే కింది లోకాలకు ఉపరితలం భూమి.. వికసిస్తున్న చైతన్యానికి భూమిని సింబాలిక్గా భావిస్తారు. ఈ చైతన్యమే జనక మహారాజు' అన్నది వాల్మీకి కథాంశంలో ప్రధాన అర్థం. ఈయన తన నాగలితో భూమిలో దారి ఏర్పాటు చేసి అందులో దాగి వున్న కుండలిని శక్తిని పైకి తీసుకువచ్చాడు.. ఆమె సీత అయింది. మనిషిలో మూలాధారం నుంచి తల దాకా ఆరు చక్రాలు ఉంటాయని అంటారు. ఇందులో మూలాధారం నుంచి సహస్రారం దాకా కుండలిని సర్పరూపంలో ప్రయాణిస్తుందిట.. ఇందులో సీత మూలాధారం అయితే.. రాముడు సహస్రారం వాల్మీకి తన రామాయణం గురించి తానే స్పష్టంగా చెప్పుకున్నాడు.. రామాయణంలో రాముడి కథ ఎంత ప్రధానమో.. సీత కథ అంతే ప్రధానమన్నాడు. భూమ్మీద రాముడు దుష్టశిక్షణ కోసం అవతరిస్తే.. ఆయన తన లక్ష్యాన్ని చేరుకోవటానికి ప్రధానంగా సహకరించింది సీతాదేవే. సీత లేకుంటే రావణ సంహారమనే రామకార్యం నెరవేరేదే కాదు. గగనతలంలో వేయికిరణాలతో ప్రకాశించే సూర్యుడే నారాయణుడు. సౌర మండలంలో మధ్యలో ఈయన ఉంటాడు. ఈ సూర్యనారాయణుడు తానే నాలుగు వ్యూహాలుగా మారి, నాలుగు వేదాలుగా మారి రామ లక్ష్మణ భరత శతృఘ్నులుగా పుట్టారట. రామావతార కథ భూమ్మీద దైవశక్తులను బలపరచటానికి, రాక్షస శక్తులను బలహీనం చేయటానికి ఉద్దేశించిందే. రాముడు ఆకాశం నుంచి దిగివచ్చిన చైతన్యమైతే.. సీతాదేవి భూమి నుంచి ఉబికి వచ్చిన మహాశక్తి, భూమ్యాకాశాల మధ్య విశ్వశ్రేయస్సును సాధించాలన్న లక్ష్యమే ఈ ఇద్దరి అవతారం. అందుకే సీతాదేవి ఎవరంటే.. చెప్పాల్సింది ఒకే ఒక్కమాట... ఆమె తాను ముందుండి రాముడిని నడిపించిన ఆదిశక్తి.

వాల్మీకి అరణ్యపర్వం మొదట్లోనే ఆమె చాలా స్పష్టంగా వివరిస్తుంది.. నేను మీకంటే ముందు నడుస్తూ దారిలో ఉన్న ముళ్లను, రాళ్లను తీసివేస్తానని.. తాను చెప్పినట్లుగానే ఆమె ముందే లంకకు చేరుకుంది.. రాక్షస శక్తులను బలహీనం చేసింది. త్రిజట లాంటి రాక్షసుల్లో కలలో కూడా నిద్ర లేకుండా చేసింది.. విభీషణుడి లాంటి సాత్వికులను రావణుడి నుంచి దూరం చేసింది. రావణుడికి సైతం భయాన్ని కలిగించింది. శతకంఠ రామాయణం అనే మరో రామాయణంలో ఆదిపరాశక్తే సీతాదేవిగా అవతరించి రాముడి కంటే ముందే లంకకు చేరుకుని సర్వరాక్షస సంహారానికి పునాది వేసిందని పేర్కొంది. సీతారాముల కలయిక ఈ పరమ ప్రయోజనాన్ని సాధించటం కోసమేనన్నది స్పష్టం. వనవాసానికి రాముడితో బయలు దేరటం మొదలుకొని, మాయలేడి కావాలని కోరటం వంటివన్నీ కూడా రావణ సంహారానికి సీతాదేవి చేసుకుంటూ పోయిన దారిలో భాగమే.. ఈ కథలన్నీ పుట్టుకురావటానికి అసలు కారణం లేకపోలేదు. సమాజంలో అత్యంత విశ్వసనీయమైన ఆరాధ్య దైవాలుగా సీతారాములు శతాబ్దాల తరబడి కొనసాగు తున్నారు, ధర్మానికి నిలువెత్తు విగ్రహం ఎవరంటే రాముడని చెప్పే పరిస్థితి. పబ్లిక్ లైఫ్కు రోల్ మోడల్ ఎవరంటే సీతారాములు అనే పరిస్థితి. అలాంటి విశ్వాసం ఉన్న సమాజంలో వాళ్ల పేర్లతో, పాత్రలతో.. కథలతో ఏదైనా చెప్తే ఆ చెప్పేది మరింత విశ్వసనీయ మవుతుంది.. అందులో మంచి ఉండవచ్చు. చెడు ఉండవచ్చు. దేన్నైనా వ్యాపింపచేయటానికి తేలికైన మార్గం ప్రజల్లో బలంగా వేళ్లూనుకునిపోయిన నమ్మకాన్ని అసరా చేసుకుని నడవటం, అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఇన్ని వేల రామాయణాలు పుట్టుకొచ్చాయి. దేన్నైనా అబ్సార్బ్ చేసుకునే ఫ్లెక్సిబిలిటీ ఈ దేశంలోని మెజారిటీ ధర్మంలో ఉంది కాబట్టే,, ఇన్ని పుట్టుకథలు.. పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి, కానీ, సీతారాముల కథ భారతీయ జాతీయ మూలం.. ఈ మూలాన్ని ఛేదించటం వేల సంవత్సరాలుగా ఎవరివల్లా కాలేదు.. ఇకముందూ ఎవరికీ సాధ్యం కాదు.

(సేకరణ: దేవ రహస్యం)

OWNED, PUBLISHED AND PRINTED BY **TIRUMALASHETTY RAMACHANDRA RAO**, PRINTED AT VAIBHAV ART PRINTERS, #11-5-419, RED HILLS, LAKADIKAPOOL, HYDERABAD500004, TELANGANA, PUBLISHED AT 6-1-628/4/7, MARKET ROAD, KHIRATABAD, HYDERABAD-4, TELANGANA EDITOR : **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NUMBER: APTEL/2008/26409, CELL: 9666711515, EMAIL: rhushinews@gmail.com